www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
31 అక్టోబర్ 2026
సంపుటి:4 సంచిక: 294

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## బంగారం ఇప్పిస్తే వెండి గద చేయిస్తా..!

- కొండగట్టు అంజన్న హుండీల్లో ఆసక్తికర లేఖలు
- గ్రామాన్ని ముంపు ప్రాంతంగా ప్రకటించాలని మొక్కు
- ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని వేడుకోలు
- పిల్లలకు తెలివితేటలు పెంచాలని మరో భక్తుడి కోరిక
- బంగారం ఇస్తే వెండి గద చేయిస్తానని మొక్కు
- 76 రోజుల్లో ఆలయానికి రూ.1.23 కోట్ల ఆదాయం

03

మియాపూర్

భూమిని కాపాడింది

## బీఆర్ఎస్

- మియాపూర్ భూముల కోసం బీఆర్ఎస్ ఎనిమిదేళ్ల పోరాడిందన్న హరీశ్‌రావు
- సుప్రీంకోర్టు తీర్పు ఘనత బీఆర్ఎస్‌దేనని వ్యాఖ్య
- మియాపూర్ భూములపై రేవంత్ వ్యాఖ్యలు అబద్ధమని విమర్శ
- 550 ఎకరాల భూముల విలువ రూ.60 వేల కోట్లకు పైమాట
- భూములను అమ్ముకునేందుకే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపణ
- మియాపూర్ భూముల పరిరక్షణలో కేసీఆర్ పాత్రను ప్రస్తావించిన హరీశ్‌రావు

02

రోడ్డెస్తే చూస్తూ

## ఊరుకోం..

- ఎంతవరకైనా పోరాడతామని స్పష్టీకరణ
- హెచ్ఎండీఏ శాఖ దాసోహంపై నిప్పులు
- చర్చనీయాంశంగా 'బిగ్ భూ దందా' కథనాలు

02

తెలంగాణలో సన్న బియ్యం ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. నాలుగు నెలల క్రితం వరకు కిలో రూ.50 నుంచి రూ.55 మధ్య దొరికిన బియ్యం ఇప్పుడు రూ.65 నుంచి రూ.83 వరకు పలుకుతోంది. అంటే తక్కువ సమయంలోనే ధరలు దాదాపు 25 శాతం పెరిగాయి. నాణ్యత తక్కువగా ఉన్న సన్న బియ్యం కూడా కిలో రూ.60 దాటేయడంతో మధ్యతరగతి కుటుంబాలు బడ్జెట్ లెక్కలు మార్చుకోవాల్సి వస్తోంది. ఇక సోనా మసూరి, బీపీటీ రకాల ధరలు రూ.75 నుంచి రూ.90 వరకు చేరాయి. నాణ్యమైన పాత బియ్యం అయితే కిలో రూ.100కు దగ్గరవుతోంది. గతేడాది ఇదే సమయంలో రూ.50 నుంచి రూ.60 మధ్య లభించిన బియ్యం ఇప్పుడు భారీగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా నిత్యం అన్నం తినే కుటుంబాలకు ఈ ధరల పెరుగుదల అదనపు భారంగా మారింది.

ఇక మార్కెట్‌లో ఒక్కో బ్రాండ్ బియ్యం ధర ఒక్కోలా ఉంది. ప్రస్తుతం జేఎస్ఆర్ ప్రీమియం కోలం కిలో రూ.83.50, జేఎస్ఆర్ రా రైస్ రూ.74.85 పలుకుతోంది. లలిత సోనా మసూరి ధర రూ.71.33 కాగా, కర్నూలు సోనా మసూరి రూ.70 వద్ద ఉంది. హెచ్ఎంటీ రా రైస్ ధర రూ.69గా నమోదైంది. అయితే కొన్ని రిటైల్ షాపుల్లో ఇదే హెచ్ఎంటీ బియ్యం రూ.78 వరకు విక్రయిస్తున్నారు. రెండు వారాల క్రితం రూ.70 ఉన్న ధర ఇప్పుడు రూ.8 పెరగడం గమనార్హం. ఉదాహరణకు నెలకు 25 కిలోల బియ్యం ఉపయోగించే కుటుంబం గతంలో కిలో రూ.55 చొప్పున రూ.1,375 ఖర్చు చేసేది. ఇప్పుడు అదే బియ్యం రూ.80 అయితే రూ.2,000 చెల్లించాల్సి వస్తుంది. అంటే కేవలం బియ్యం కోసమే నెలకు రూ.625 అదనంగా ఖర్చవుతోంది.

# అన్నం భారమేనా?

## సన్న బియ్యం కిలో ధర రూ.65-83కు చేరింది

### నాలుగు నెలల్లో ధరలు 25 శాతం పెరిగాయి

- ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు తగ్గింది
- ఇతర రాష్ట్రాల డిమాండ్‌తో ధరలకు రెక్కలు
- వ్యాపారుల నిల్వలతో కృత్రిమ కొరత అనుమానాలు
- బియ్యం ధరలతో సామాన్యులపై అదనపు భారం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అసలు సన్న బియ్యం ధరలు ఎందుకు ఇంత వేగంగా పెరుగుతున్నాయంటే ప్రధాన కారణాల్లో ఎల్‌నినో ప్రభావం ఒకటి. వర్షపాతం తగ్గడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం తగ్గింది. గతేడాది రాష్ట్రంలో 92.17 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈసారి 78.23 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంటే దాదాపు 13.94 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. దీంతో మార్కెట్‌లోకి వచ్చే ధాన్యం పరిమాణం తగ్గే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. అయితే సాగు విస్తీర్ణం తగ్గినంత మాత్రాన

మిగతా 2లో..

రాజకీయాల నుంచి

## తప్పుకుంటా!

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపునకు ఈటల డిమాండ్
- డీపీఆర్ సిద్ధం చేస్తే కేంద్ర నిధులు తెస్తానని హామీ
- నిధులు తేకపోతే రాజకీయాలకు గుడ్‌బై అని సవాల్
- డంపింగ్ యార్డ్‌తో ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఉందని ఆరోపణ
- రూ.2 వేల కోట్లతో సమస్య పరిష్కారమవుతుందని వ్యాఖ్య
- డంపింగ్ యార్డ్ తరలించే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం

02

## ధరాఘాతం షరా మామూలే..

- ధరల భారంతో సతమతం అవుతున్న సామాన్యుడు
- ఆకాశాన్ని అంటుతున్న బియ్యం ధరలు
- మార్కెట్లలో మండుతున్న కూరగాయల రేట్లు
- చాలీచాలని ఆదాయంతో కష్టతరంగా సగటుజీవి జీవనం
- నియంత్రించాల్సిన అధికారుల జాడ ఎక్కడ...?

04

## ముఖ్యమంత్రి అధికారంలో ఉండొద్దు

- ఇంద్రవెల్లి అమరవీరులకు కవిత నివాళులు
- రేవంత్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- ఆదిలాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- తుమ్మిడిహెట్టి నిర్మాణంపై ప్రశ్నలు
- ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్
- కేటీఆర్‌ను నిలదీసిన కవిత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఇంద్రవెల్లి గడ్డపై ఆదివాసీ అమరవీరులకు నివాళులు అర్పిస్తూ మొదలైన కల్వకుంట్ల కవిత ప్రసంగం.. తెలంగాణలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీలను లక్ష్యంగా చేసుకున్న విమర్శలతో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై హామీల అమలు, సాగునీరు, రైతుల సమస్యల విషయంలో విమర్శలు గుప్పిస్తూనే.. మరోవైపు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ జిల్లాకు జరిగిన కేటాయింపులు, అభివృద్ధిపై కూడా కవిత ప్రశ్నలు సంధించారు. ముఖ్యంగా ఇంద్రవెల్లి పోరాట చరిత్రను ప్రస్తావిస్తూ రామ్ జీ గొండు, వన్నెల ఎల్లన్న, వెడమ రాము, కొమురం భీమ్, శిడెం శింబు, కొమురం సూరుల

మిగతా 3లో..

మల్లారెడ్డి వర్సిటీకి

## నోటీసులు

- మల్లారెడ్డి యూనివర్సిటీకి నోటీసులు ఇవ్వనున్న మండలి
- సినిమా కోసం మల్లారెడ్డి కాలేజీకి సెలవు ప్రకటన
- అక్టోబర్ 30న సెలవు ఇస్తామని ప్రీతిరెడ్డి వెల్లడి
- సెలవు నిర్ణయంపై విద్యార్థి సంఘాల అభ్యంతరం
- ఉన్నత విద్యామండలికి ఎస్ఎఫ్ఐ నాయకుల ఫిర్యాదు
- విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చట్టం ప్రతిపాదన

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సినిమా రిలీజ్ అవుతుందంటే అభిమానులు ఫస్ట్ డే ఫస్ట్ షో కోసం కాలేజీకి బంక్ కొట్టడం కామన్. కానీ ఏకంగా కాలేజీ యాజమాన్యమే సినిమా కోసం సెలవు ప్రకటిస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విద్యాసంస్థల విషయంలో అదే జరిగింది.

మిగతా 2లో..

## కేసీఆర్ భూ లీలలు బయటపడ్డాయి

- మియాపూర్ భూములు ప్రభుత్వానివేనని సుప్రీం తీర్పు
- రూ.50 వేల కోట్ల భూములను కాపాడామని సీఎం వెల్లడి
- కేసీఆర్‌పై భూకబ్జా ఆరోపణలు చేసిన రేవంత్
- రూ.1.50 లక్షల కోట్ల భూములు రక్షించామని ప్రకటన
- భూముల విక్రయ నిధులు అభివృద్ధికి కేటాయింపు
- భూ ఆక్రమణలపై అసెంబ్లీకి రావాలని బీఆర్ఎస్‌కు సవాల్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో రూ.50 వేల కోట్ల విలువైన భూముల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ భూములు ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌ను అడ్డుపెట్టుకుని కేసీఆర్ ఈ విలువైన భూములను దక్కించుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములపై కన్నేశారని విమర్శించారు. అయితే తమ ప్రభుత్వం న్యాయపోరాటం చేసి వేల కోట్ల విలువైన ఆస్తులను కాపాడిందని చెప్పారు. మియాపూర్ భూముల విషయంలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడాన్ని చారిత్రక విజయంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మియాపూర్ భూముల వివాదం తనకు ఇప్పటిది కాదని, ఎన్నో ఏళ్లుగా ఈ వ్యవహారంపై పోరాడుతున్నానని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ప్రభుత్వ భూముల ఆక్రమణలను ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. ఈ పోరాటాల కారణంగానే తనపై రాజకీయ కక్ష పెంచుకుని జైలుకు పంపించారని ఆరోపించారు.

మిగతా 2లో..

## ఖైరతాబాద్ దానం నాగేందర్‌దే!

- ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దానం నాగేందర్ అభ్యర్థి అని ప్రకటన
- ఎన్నికలను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకుంటానన్న రేవంత్
- తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాదని వ్యాఖ్య
- కాళేశ్వరం అంశం పై నిపుణుల సూచనలతో నిర్ణయాలు
- అసెంబ్లీ చర్చలకు బీఆర్ఎస్ దూరంగా ఉంటోందని విమర్శ
- మెట్రో ఫేజ్-1 లోన్‌ను అడ్డుకుంటున్నారని ఆరోపణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే సస్పెన్స్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టారు. కాంగ్రెస్ తరపున దానం నాగేందర్ పోటీ చేస్తారని స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఈ కీలక విషయాన్ని వెల్లడించారు. ఎన్నిక చిన్నదైనా, పెద్దదైనా తాను చాలా సీరియస్‌గా తీసుకుంటానని చెప్పారు. ఏ ఎన్నికనూ తేలిగ్గా తీసుకునే అలవాటు తనకు లేదని, అలా వ్యవహరించి ఉంటే రాజకీయాల్లో ఈ స్థాయికి చేరుకునేవాడిని కాదన్నారు.

మిగతా 3లో..

## రోడ్డేస్తే చూస్తూ ఊరుకోం..

**విశాలభారతి, మణికొండ:**

బిగ్ రోడ్డు పేరుతో 'బిగ్ దందా' జరుగుతోందని, అభివృద్ధి ముసుగులో సామాన్యుల ఇండ్లను నేలమట్టం చేసి రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వంలోని కొందరు పెద్దలు కుట్రలు జరుపుతున్నారంటూ సెవెన్‌హిల్స్, వెస్ట్రన్ మిడోస్ కాలనీల ప్రజలు సర్కార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ కాలనీపై నుంచి 100 అడుగుల రహదారి మాస్టర్ ప్లాన్‌పై బిగ్‌రోడ్డు బిగ్ దందా పేరిట వరుస కథనాలతో అధికారుల మాయాజాలాన్ని బట్టబయలు చేస్తున్న నమస్తే తెలంగాణ కథనాలు చర్చనీయాంశంగా మారాయి. కొన్నాళ్లుగా రాయలసీమకు చెందిన ఓ బిల్డరు అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వంలోని కీలక శాఖల అధికారులు, బిగ్‌బ్రదర్స్‌తో అంతర్గత ఒప్పందాలను చేసుకుని వారందరినీ కీలుబొమ్మలా వేలకోట్ల రూపాయల విలువైన భూములను కాజేస్తున్నాడంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. గతంలో కిస్మత్‌పూర్, బండ్లగూడ, గండిపేట, మంచిరేవుల గ్రామాలల్లో వందల కోట్ల రూపాయల విలువైన సర్కార్ భూములను సైతం సదరు బిల్డరు కొల్లగొట్టారంటూ బాధితులు మండిపడ్డారు. అదే తరహాలో నార్సింగిలోని సర్కార్ భూములను అగ్గువ ధరకు అధికారుల లోపాయికారిక ఒప్పందాలతోనే సుమారు రూ.150 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కేవలం రూ. 26 కోట్లకే వేలంలో దక్కించుకోవడం వెనుక బిగ్‌బ్రదర్స్ హస్తం ఉందంటూ మండిపడ్డారు. ఇంత బహిరంగంగా వందల కోట్ల విలువైన భూములను హెచ్ఎండీఏ అధికారులు సైతం ధారదత్తం చేస్తుండటం వెనుక ఆంతర్యమేమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ఎక్కడ అవసరమైతే అక్కడ రోడ్ల అలైన్‌మెంట్లు, మాస్టర్‌ప్లాన్ మార్చిడి సదరు బిల్డరుకు అనుకూలంగా భూములకు రెట్టింపు ధరలను కల్పించే దిశగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నార్సింగిలోని వెస్ట్రన్ మిడోస్, సెవెన్‌హిల్స్ కాలనీల మీదుగా ప్రతిపాదిం చిన 100 అడుగుల రహదారి వ్యవహారం కూడా ఒకటన్నారు. ఈ బిల్డర్ వ్యవహారంపై సీబీఐ విచారణ చేపట్టాలంటూ బాధితులు డిమాండ్ చేశారు. వరుసగా రెండు రోజులుగా 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన ప్రత్యేక కథనాలతో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది. ఏండ్ల తరబడి కష్టపడి, పైసాపైసా కూడబెట్టి తమ కలల సౌధాలను నిర్మించుకున్నామని, ఇప్పుడు వాటి మీదుగా 100 అడుగుల రహదారి వేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని బాధితులు స్పష్టం చేస్తున్నారు.

# మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. రెండు దశాబ్దాలకు పైగా కొనసాగిన న్యాయపోరాటానికి తెరపడటంతో ఈ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి చెందినవేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తిపై హక్కులు ఖరారయ్యాయి. అయితే ఈ తీర్పు వెలువడిన వెంటనే అసలు రాజకీయ వివాదం మొదలైంది. ఈ భూములను కాపాడిన ఘనత తమదంటే తమదని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు తీర్పును తమ ప్రభుత్వ విజయంగా అభివర్ణిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మాత్రం ఈ విజయానికి అసలు పునాది తమ ప్రభుత్వ హయాంలోనే పడిందని చెబుతున్నారు. ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో వెల్లడించిన అంశాలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని, సుప్రీంకోర్టు రికార్డులే తమ వాదనకు ఆధారమని ఆయన పేర్కొన్నారు. దీంతో మియాపూర్ భూముల వ్యవహారం కేవలం న్యాయపరమైన అంశంగా కాకుండా, రెండు ప్రధాన రాజకీయ పార్టీల మధ్య క్రెడిట్ వార్‌గా మారింది. హరీశ్ రావు వెల్లడించిన వివరాల ప్రకారం, మియాపూర్ భూ వివాదం 2003లోనే ప్రత్యేక అనుమతి పిటిషన్ రూపంలో సుప్రీంకోర్టుకు చేరింది. 2013లో అది సివిల్ అప్పీల్‌గా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ భూములు ప్రభుత్వ చేతుల్లోనే ఉండాలనే లక్ష్యంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం న్యాయపరమైన చర్యలను వేగవంతం చేసిందని ఆయన చెబుతున్నారు. ముఖ్యంగా 2015లో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీ.ఎస్. వైద్యనాథన్‌ను తెలంగాణ ప్రభుత్వం తరఫున వాదించేందుకు నియమించడం కీలక పరిణామమని గుర్తుచేశారు. 2015 ఏప్రిల్ 7 నుంచి వైద్యనాథన్ ప్రభుత్వ తరఫున ఈ కేసులో వాదనలు వినిపించారని, 2023 వరకు దాదాపు ఎనిమిదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ భూముల పరిరక్షణ కోసం న్యాయపోరాటం కొనసాగించిందని హరీశ్ రావు వివరించారు. ఈ క్రమంలో భూములకు సంబంధించిన పాత రెవెన్యూ రికార్డులు, పత్రాలు, అఫిడవిట్లు, ఇతర ఆధారాలను న్యాయస్థానం ముందు ఉంచినట్లు పేర్కొన్నారు. అయితే ఈ వివాదం అంతకుముందే ప్రారంభమైనందున, మొత్తం 23 ఏళ్ల న్యాయప్రక్రియను ఒక్క ప్రభుత్వ హయాంలో జరిగిన పోరాటంగా చూడలేమనే అంశాన్ని కూడా గుర్తించాలి. వివిధ ప్రభుత్వాల కాలంలో కొనసాగిన న్యాయపరమైన ప్రక్రియలో ఎవరు ఎలాంటి పాత్ర పోషించారనేది కోర్టు రికార్డులు, ప్రభుత్వ పత్రాల ఆధారంగా పరిశీలించాల్సిన అంశం. ఈ వివాదంలో హరీశ్ రావు ప్రధానంగా ప్రస్తావిస్తున్న మరో కీలక అంశం ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ వర్సెస్ ఎం.ఎస్. మూర్తి కేసు. 2023 జూన్ 15న సుప్రీంకోర్టు ఈ కేసులో తీర్పు వెలువరించింది. అప్పటికి తెలంగాణలో అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఈ కేసులోనూ తెలంగాణ ప్రభుత్వం తరఫున సీ.ఎస్. వైద్యనాథన్ వాదనలు వినిపించారు. ఇప్పుడు మియాపూర్ భూములపై వెలువడిన తీర్పులో సుప్రీంకోర్టు ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ కేసులోని 93వ పేరాలో పేర్కొన్న చట్టపరమైన అంశాలను ప్రస్తావించింది. ముఖ్యంగా ఏపీ అబాలిషన్ ఆఫ్ జాగీర్స్ రెగ్యులేషన్స్, అటియత్ ఎంక్వైరీస్ యాక్ట్‌కు సంబంధించిన నిబంధనలను వివరించే క్రమంలో ఆ పాత తీర్పును ఆధారంగా తీసుకుంది. ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ, ట్రినిటీ కేసులో తమ ప్రభుత్వం సాధించిన న్యాయపరమైన విజయం మియాపూర్ తీర్పులో కీలకమైన చట్టపరమైన ఆధారంగా ఉపయోగపడిందని హరీశ్ రావు వాదిస్తున్నారు. అంటే మియాపూర్ కేసులో తుది తీర్పు ఒకరోజులో వచ్చిన పరిణామం కాదని, గతంలో జరిగిన న్యాయపోరాటాలు, చట్టపరమైన వాదనలు, కోర్టు ముందుంచిన ఆధారాల సమాహారమని బీఆర్ఎస్ చెబుతోంది. అయితే ఒక పాత తీర్పును ప్రస్తుత తీర్పులో ప్రస్తావించడం మాత్రమే మొత్తం తుది విజయం ఒకే ప్రభుత్వానికి చెందుతుందని నిరూపించదు. కోర్టు పరిశీలించిన మొత్తం ఆధారాలు, న్యాయవాదనలు, చట్టపరమైన అంశాలన్నీ ఇందులో భాగమే. ఇదిలా ఉంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం సుప్రీంకోర్టు తీర్పు తమ ప్రభుత్వానికి పెద్ద విజయమని ప్రకటించారు. గతంలో ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడేందుకు కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే పోరాటం చేసిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా న్యాయపరమైన చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో భూములకు సంబంధించిన రికార్డుల విషయంలో అక్రమాలు జరిగాయని, అప్పటి పాలకులు భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అయితే హరీశ్ రావు ఈ ఆరోపణలను ఖండిస్తూ, సుప్రీంకోర్టు తీర్పులోని అంశాలను రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవద్దని విమర్శించారు. ముఖ్యమంత్రి మీడియా సమావేశం పెట్టి గత ప్రభుత్వ పాత్రను విస్మరించడం సరికాదని అన్నారు. ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, సుప్రీంకోర్టు తీర్పు ప్రధానంగా భూముల యాజమాన్య హక్కులపై వెలువడింది. ప్రైవేటు వ్యక్తులు తమకు చట్టబద్ధమైన హక్కు ఉందని నిరూపించలేకపోయారని, ప్రభుత్వ భూమిపై హక్కు కల్పించే ఆధారాలు లేవని న్యాయస్థానం స్పష్టం చేసింది. అందువల్ల భూముల యాజమాన్యంపై కోర్టు ఇచ్చిన తీర్పును, రాజకీయ నాయకులు తమ ప్రభుత్వాల పనితీరుకు సంబంధించిన వాదనలతో కలిపి చూడకూడదు. ఎవరు ఏ సమయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారనేది వేరుగా పరిశీలించాల్సిన అంశం. ఇక ఈ మొత్తం వివాదంలో అత్యంత ఆసక్తికరమైన అంశం 550 ఎకరాల భూముల భవిష్యత్తు. ఈ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లకు పైగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కొన్ని నివేదికల్లో ఈ విలువకు సంబంధించి భిన్నమైన అంచనాలు కూడా వెలువడ్డాయి. ఈ భూములను ఖాళీగా ఉంచడం కంటే వేలం ద్వారా విక్రయించి, వచ్చే ఆదాయాన్ని సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలనే ఆలోచనను ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ప్రతిపాదనను కేబినెట్ సబ్‌కమిటీ పరిశీలించి, అనంతరం కేబినెట్‌లో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దీనిపైనే హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడి కాపాడిన ప్రజల ఆస్తిని ఇప్పుడు అమ్ముతామని ప్రకటించడం సిగ్గుచేటని విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి మీడియా సమావేశం వెనుక ఉన్న అసలు ఉద్దేశం భూములను విక్రయించడమేనని, అందుకే గత ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే భూములను విక్రయించడం, వాటిని అభివృద్ధి అవసరాలకు వినియోగించడం, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికను ప్రజల ముందుంచాల్సి ఉంటుంది. అదే సమయంలో ఇంతటి విలువైన ప్రభుత్వ ఆస్తి విషయంలో పారదర్శకత, సరైన ధర నిర్ణయం, ప్రజా ప్రయోజనాల పరిరక్షణ అత్యంత కీలకం. మొత్తంగా మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వ యాజమాన్య హక్కు స్పష్టమైనప్పటికీ, ఆ విజయం వెనుక ఎవరి పాత్ర ఎంత, భవిష్యత్తులో ఈ భూములను ఎలా వినియోగించాలి అనే రెండు అంశాలు తెలంగాణ రాజకీయాల్లో మరికొంతకాలం చర్చకు కేంద్రంగా కొనసాగే అవకాశముంది.

# కేసీఆర్ భూ లీలలు బయటపడ్డాయి

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యంగా మియాపూర్ భూముల వ్యవహారంలో రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావుకు ఖరీదైన కార్లు లంచంగా ఇచ్చారని, కేసీఆర్‌కు నగదు రూపంలో ముడుపులు అందాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో విలువైన భూములను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరిగాయని విమర్శించారు. అయితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భూముల రక్షణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టిందన్నారు. సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించడంతో తీర్పు అనుకూలంగా వచ్చిందని తెలిపారు. భూములు మళ్లీ ఆక్రమణలకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించినట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేవలం మియాపూర్ మాత్రమే కాకుండా హైదరాబాద్ చుట్టుపక్కల అనేక ప్రాంతాల్లో భూ వివాదాలను పరిష్కరించేందుకు న్యాయపోరాటం చేసినట్లు వివరించారు. ఐఎంజీ భూములను భలేరావు కుటుంబ సభ్యులతో కలిసి కేటీఆర్ దక్కించుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి ప్రాంతాల్లోనూ బీఆర్ఎస్ నాయకుల భూ ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకున్నామని చెప్పారు. గుర్రంగూడ అటవీ భూములపై కేటీఆర్ అనుచరులు కన్నేశారని, సుప్రీంకోర్టులో పోరాడి అవి అటవీ భూములేనని నిర్ధారించామని తెలిపారు. మంచిరేవులలోని 143 ఎకరాలను కేటీఆర్, రాయలసీమ బిల్డర్స్ కలిసి దక్కించుకోవాలని చూశారని విమర్శించారు. అయితే ఆ భూములను రక్షించి పోలీసుల పిల్లల కోసం పాఠశాల ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజల ఆస్తులను కాపాడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో జరిగిన భూ వివాదాలపైనా రేవంత్ రెడ్డి స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేకు బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టుకు తీసుకెళ్లి భూమిని కాపాడుకున్నామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ బీఆర్ఎస్ నాయకుల భూ ఆక్రమణలను అడ్డుకున్నట్లు వెల్లడించారు.

మరోవైపు మాజీ మంత్రి హరీశ్ రావు మామ హనుమంత రావుపైనా సీఎం విమర్శలు చేశారు. ఆయన ఆక్రమించారని ఆరోపిస్తున్న భూములను సర్వే చేయకుండా అధికారులను అడ్డుకుంటున్నారని, కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారని పేర్కొన్నారు. పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై ఉమ్మడి రాష్ట్రంలో కేసులు వేసిన కేసీఆర్, హరీశ్ రావు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. గతంలో ఎవరిపై కేసులు వేశారో వారితోనే తర్వాత రాజీ పడ్డారని విమర్శించారు. భూ వివాదాలపై అసెంబ్లీలో చర్చకు రావాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. ఇక ప్రభుత్వం కాపాడిన వేల కోట్ల విలువైన భూములను ఎలా ఉపయోగించాలనే అంశంపైనా రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ భూముల్లో కొన్నింటిని విక్రయించి వచ్చే డబ్బును ప్రజల అవసరాలకు ఖర్చు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా విద్య, వైద్యం, నీటి పారుదల రంగాల అభివృద్ధికి నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు. మియాపూర్ భూముల విక్రయం ద్వారా వచ్చే ఆదాయాన్ని విద్యారంగానికి ఉపయోగిస్తామని ప్రత్యేకంగా ప్రకటించారు. అయితే భూముల అమ్మకాలపై నిర్ణయం తీసుకునే ముందు క్యాబినెట్‌లో చర్చిస్తామని తెలిపారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఈ అంశంపై అధ్యయనం చేయనుంది. మరోవైపు మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చినా బీఆర్ఎస్ నాయకులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. భూములను కాపాడిన రెవెన్యూ అధికారులను కనీసం అభినందించడం లేదని విమర్శించారు. భూ ఆక్రమణలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని బీఆర్ఎస్ నేతలకు మరోసారి సవాల్ విసిరారు.

# మల్లారెడ్డి వర్సిటీకి నోటీసులు

**మొదటిపేజీ తరువాయి**

దర్శకుడు త్రివిక్రమ్, హీరో వెంకటేశ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ఆదర్శ కుటుంబం' సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను మల్లారెడ్డి కాలేజీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లారెడ్డి విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ ప్రీతిరెడ్డి ఆసక్తికరమైన ప్రకటన చేశారు. సినిమా విడుదలయ్యే అక్టోబర్ 30న కాలేజీకి సెలవు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అక్కడున్న విద్యార్థులు ఉత్సాహంగా స్పందించినప్పటికీ, బయట మాత్రం ఈ నిర్ణయంపై పెద్ద చర్చ మొదలైంది. సినిమా ప్రమోషన్ కోసం విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడం ఎంతవరకు సరైన నిర్ణయమనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం చివరకు తెలంగాణ ఉన్నత విద్యామండలి దృష్టికి వెళ్లింది. మల్లారెడ్డి కాలేజీల్లో సినిమా ఈవెంట్లు నిర్వహించడం కొత్త విషయం కాదు. ఇప్పటికే పలువురు సినీ ప్రముఖుల కార్యక్రమాలకు ఈ విద్యాసంస్థలు వేదికగా మారాయి. అయితే గతంలో రాజకీయ కార్యక్రమాల నిర్వహణపై విమర్శలు ఎదుర్కొన్న విద్యాసంస్థలు ఇప్పుడు సినిమా ప్రమోషన్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి వారం ఏదో ఒక మూవీ ఈవెంట్ నిర్వహించడం వల్ల కాలేజీలు తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. కానీ విద్యార్థుల చదువులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సంస్థల్లో సినిమా కార్యక్రమాల కోసం సెలవులు ప్రకటించడం వివాదానికి కారణమైంది. ముఖ్యంగా వెంకటేశ్ నటించిన 'ఆదర్శ కుటుంబం' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ప్రీతిరెడ్డి చేసిన ప్రకటన వైరల్ కావడంతో నెటిజన్లు స్పందించడం మొదలుపెట్టారు. కాలేజీ అనేది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రదేశమని, సినిమా ప్రచార కార్యక్రమాలకు వేదికగా మాత్రమే మారకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ నిర్ణయంపై విద్యార్థి సంఘాలు కూడా అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ వివాదంపై స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్‌తోపాటు ఇతర విద్యార్థి సంఘ నాయకులు తెలంగాణ ఉన్నత విద్యామండలిని ఆశ్రయించారు. సినిమా విడుదల సందర్భంగా కాలేజీకి సెలవు ప్రకటించిన వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ.బాలకిష్టారెడ్డికి ఫిర్యాదు అందజేశారు. విద్యాసంస్థల్లో అకడమిక్ కార్యకలాపాల కంటే సినిమా ప్రమోషన్లకు ప్రాధాన్యం ఇవ్వడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన చైర్మన్ మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీకి నోటీసులు జారీ చేసి వివరణ కోరతామని హామీ ఇచ్చారు. దీంతో సినిమా కోసం సెలవు ప్రకటించిన వ్యవహారం కేవలం సోషల్ మీడియా చర్చకే పరిమితం కాకుండా అధికారిక పరిశీలన దశకు చేరుకుంది. విద్యాసంస్థలు సెలవులు ప్రకటించే విషయంలో ఎలాంటి నిబంధనలు పాటించాలనే అంశం కూడా ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించి ప్రత్యేక చట్టం అవసరమనే అంశాన్ని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ.బాలకిష్టారెడ్డి ప్రస్తావించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థుల భద్రత, వారి ప్రయోజనాలను కాపాడేందుకు స్పష్టమైన నిబంధనలు ఉండాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక బిల్లు ముసాయిదాను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఆ ముసాయిదాను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాతోపాటు ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి శ్రీధర్‌కు సమర్పించారు. విద్యాసంస్థల్లో జరిగే కార్యక్రమాలు, విద్యార్థుల భద్రత వంటి అంశాలపై మరింత పర్యవేక్షణ అవసరమనే చర్చ కొనసాగుతోంది. అయితే సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించడం తప్పా అనే ప్రశ్న కూడా ఇక్కడ వస్తోంది. విద్యార్థులకు వినోదం, ప్రముఖులతో ఇంటరాక్షన్ అవకాశాలు కల్పించడం ఒక అంశమైతే, వాటి కారణంగా రెగ్యులర్ క్లాసులు ప్రభావితం కాకుండా చూడటం మరో ముఖ్యమైన బాధ్యత. ఈ రెండింటి మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉంది. ఇక సోషల్ మీడియాలో మాత్రం మల్లారెడ్డి విద్యాసంస్థలపై విమర్శలు కొనసాగుతున్నాయి. కాలేజీలా నిర్వహిస్తున్నారా? లేక సినిమా ప్రమోషన్ ఏజెన్సీలా మార్చేశారా? అంటూ కొందరు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. పిల్లలను కాలేజీల్లో చేర్పించే ముందు తల్లిదండ్రులు ఇలాంటి విషయాలను కూడా పరిశీలించాలని సూచిస్తున్నారు. అయితే మరోవైపు విద్యార్థులకు సినిమాలు, సెలబ్రిటీ ఈవెంట్లపై ఆసక్తి ఉండటం సహజమే. ప్రముఖ నటులను ప్రత్యక్షంగా చూసే అవకాశం రావడం వారికి ప్రత్యేక అనుభూతిని ఇవ్వొచ్చు. కానీ అలాంటి కార్యక్రమాల కోసం చదువులకు సెలవు ప్రకటించడం అవసరమా అనేదే అసలు చర్చ. ముఖ్యంగా విద్యాసంస్థల నిర్వహణలో అకడమిక్ క్యాలెండర్, విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ వంటి అంశాలు కీలకం. ఇప్పుడు తెలంగాణ ఉన్నత విద్యామండలి నోటీసుల నేపథ్యంలో మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఎలాంటి వివరణ ఇస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మొత్తానికి ఒక సినిమా ట్రైలర్ ఈవెంట్‌తో మొదలైన వ్యవహారం ఇప్పుడు విద్యాసంస్థల బాధ్యతలు, నిర్వహణ విధానాలపై చర్చకు దారితీసింది.

## శ్రీశైలం నుంచి 79 రోజుల్లో 72 టీఎంసీలు ఎత్తిపోసిన ఏపీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కృష్ణా జలాలను ఇష్టారాజ్యంగా తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్ సర్కార్‌ను నిలువరించడంలోనే కాదు, ప్రస్తుతం నీటి వాటాలను తేల్చడంలోనూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చేతులెత్తేసింది. మూడు నెలలుగా మీటింగ్‌ల పేరిట సాగదీస్తున్న బోర్డు.. ఇప్పుడు వాటాల అంశాన్ని అపెక్స్‌కు నివేదిస్తామని చెప్పి జారుకున్నది. గతంలోనే ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వానికి నివేదించగా.. ట్రిబ్యునల్, బోర్డులోనే తేల్చుకోవాలని కేంద్రం స్పష్టంచేసింది. అయినప్పటికీ, మళ్లీ కేంద్రానికే నివేదిస్తామని చెబుతూ బోర్డు చేతులెత్తేసింది. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలన్నీ అడుగంటిపోయాక, ఇప్పటివరకు మీటింగ్ ఏర్పాటు చేయకుండా తాత్సారం చేస్తూ ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తూ వచ్చిన బోర్డు.. ఇప్పుడు మళ్లీ కేంద్రానికే నివేదిస్తామని చెప్పడం గమనార్హం. అయితే, తెలంగాణ సర్కార్ వైఫల్యమే ఈ పరిస్థితి కారణమని ఇరిగేషన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**నీటి వాటాల పేచీ మళ్లీ అపెక్స్‌కు**

కృష్ణా జలాలకు సంబంధించి ట్రిబ్యునల్ కేటాయింపులు లేని నేపథ్యంలో రాష్ట్ర విభజన సందర్భంగా రెండు రాష్ట్రాలు కేవలం ఏడాది కాలానికి తాత్కాలిక ఒప్పందం చేసుకున్నాయి. ఉమ్మడి రిజర్వాయర్ల నుంచి కృష్ణా జలాలను ఏపీ 66%, తెలంగాణ 34% చొప్పున వినియోగించుకోవాలని తాత్కాలిక ఒప్పందం చేసుకున్నాయి. ఆ తరువాత ప్రతి నీటి సంవత్సరంలోనూ ఆ తాత్కాలిక ఒప్పందాన్ని ఎప్పటికప్పుడు పొడిగించుకుంటూ వచ్చాయి. అయితే, అవార్డు తేలేవరకు 50:50 నిష్పత్తిలో జలాలను వినియోగించుకుంటామని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం 17వ బోర్డు మీటింగ్ నుంచి డిమాండ్ చేస్తూ వచ్చింది.

# రాజకీయాల నుంచి తప్పకుంటా!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తన పోరాటాన్ని మరింత స్పీడ్ పెంచారు. చెత్త డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా తరలించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్లాన్ సిద్ధం చేస్తే, కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చే బాధ్యత తనదేనని ప్రకటించారు. అంతేకాదు, నిధులు మంజూరు చేయించలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ సంచలన సవాల్ విసిరారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జవహర్‌నగర్ ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలంటూ ఆయన చేపట్టిన 'జవహర్‌నగర్ జన సంకల్ప యాత్ర' గురువారం మూడో రోజుకు చేరుకుంది. కీసర నుంచి సాగిన ఈ పాదయాత్రకు స్థానికులు స్వాగతం పలికారు. డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను నేరుగా తెలుసుకుంటూ ఈటల ముందుకు సాగారు. ఈ సమస్యను కేవలం రాజకీయ అంశంగా కాకుండా ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యవసర సమస్యగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. డంపింగ్ యార్డ్ తరలింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేయాలని ఈటల రాజేందర్ సూచించారు. ఎంత ఖర్చవుతుంది? ఎక్కడికి తరలించాలి? అక్కడ ఎలాంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి? అనే అంశాలతో స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఆ నివేదిక సిద్ధమైతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి అవసరమైన నిధులు తీసుకొస్తానని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతోనే ఈ బాధ్యత తీసుకుంటున్నట్లు వివరించారు. తన రాజకీయ జీవితంలో ఆరుగురు ముఖ్యమంత్రులతో వివిధ ప్రజా సమస్యలపై పోరాడిన అనుభవం ఉందని గుర్తుచేశారు. కీసరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడిన ఆయన, జవహర్‌నగర్ ప్రజలకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

డంపింగ్ యార్డ్ తరలింపుపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈటల రాజేందర్ తీవ్రంగా ప్రస్తావించారు. ముఖ్యంగా చెత్త నుంచి బయటకు వచ్చే కలుషిత ద్రవాలు సమీపంలోని చెరువులు, భూగర్భ జలాలను ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో బోర్ల నుంచి ఆకుపచ్చ రంగులో నీరు వస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి నీటిని ఉపయోగించడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల నివసించే కుటుంబాలు నిత్యం దుర్వాసన, నీటి కాలుష్యం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని వివరించారు. చెత్త నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రాంకీ సంస్థ పనితీరుపైనా విమర్శలు చేశారు. వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకపోతే దాని ప్రభావం ఒక్క ప్రాంతానికే పరిమితం కాదని, భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు సమస్య విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన నీరు అందించడం ప్రభుత్వ బాధ్యతని గుర్తుచేశారు. ఇక డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం కోసం భారీగా డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని ఈటల రాజేందర్ అభిప్రాయపడ్డారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తే చెత్తను రీసైక్లింగ్ చేసి ఉపయోగకరమైన వనరులుగా మార్చవచ్చని చెప్పారు. వ్యర్థాల నిర్వహణను సరైన పద్ధతిలో చేపడితే కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడవచ్చని వివరించారు. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, కానీ జవహర్‌నగర్ సమస్యపై ఎందుకు దృష్టిపెట్టడం లేదని ప్రశ్నించారు. తన అంచనా ప్రకారం సుమారు రూ.2 వేల కోట్లతో డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపవచ్చని పేర్కొన్నారు. ఖర్చు ఎంతనే లెక్కల కంటే ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకొస్తే కేంద్ర సహకారంతో ఈ సమస్యను పరిష్కరించవచ్చని ధీమా వ్యక్తం చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించే వరకు తన ఉద్యమం కొనసాగుతుందని ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడమే తన పాదయాత్ర ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఇప్పటికే మూడు రోజులుగా కొనసాగుతున్న జన సంకల్ప యాత్ర ద్వారా స్థానికుల ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు శుక్రవారం జవహర్‌నగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. డంపింగ్ యార్డ్ కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు పెద్ద సంఖ్యలో సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా హాజరయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి డంపింగ్ యార్డ్ తరలింపు అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలక చర్చగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేస్తుందా? కేంద్రం నుంచి నిధులు వస్తాయా? ప్రజలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుంది? అనే ప్రశ్నలు ఆసక్తికరంగా మారాయి.

# అన్నం భారమేనా?

**మొదటిపేజీ తరువాయి**

అదే స్థాయిలో దిగుబడి తగ్గుతుందని చెప్పలేం. వాస్తవ దిగుబడి వాతావరణం, నీటి లభ్యత, పంట పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు బియ్యానికి డిమాండ్ మాత్రం కొనసాగుతోంది. సరఫరా తగ్గుతుందనే అంచనాల మధ్య వ్యాపారులు ధరలు పెంచడంతో వినియోగదారులపై భారం పడుతోంది. తెలంగాణ సన్న బియ్యానికి ఇతర రాష్ట్రాల్లో భారీ డిమాండ్ ఉండటం కూడా స్థానిక ధరలను ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా తెలంగాణ సోనా, హెచ్ఎంటీ, బీపీటీ రకాలను మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. అక్కడి వ్యాపారులు నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం జిల్లాలకు నేరుగా వచ్చి రైతుల నుంచి ధాన్యాన్ని అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో స్థానిక మార్కెట్‌లో నాణ్యమైన సన్న బియ్యం లభ్యతపై ఒత్తిడి పెరుగుతోంది. ఇదే సమయంలో కొందరు వ్యాపారులు బియ్యాన్ని నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మరోవైపు రైస్ మిల్లర్లు గతంలో మాదిరిగా అప్పుపై సరుకు ఇవ్వకుండా క్యాష్ అండ్ క్యారీ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో రిటైలర్లపై ఆర్థిక ఒత్తిడి పెరిగి, అమ్మకపు ధరల్లోనూ మార్పులు కనిపిస్తున్నాయి. ఇక ప్రభుత్వం దగ్గర ఉన్న ధాన్యం నిల్వల వ్యవహారం కూడా ఇప్పుడు కీలకంగా మారింది. గత ఖరీఫ్ సీజన్‌లో పౌరసరఫరాల సంస్థ దాదాపు 72 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. అయితే అందులో కేవలం 5 లక్షల టన్నులే మిగులు నిల్వలుగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు కస్టమ్ మిల్లింగ్ కోసం ఇచ్చిన ధాన్యం విషయంలో కొన్ని మిల్లుల్లో అక్రమాలు జరిగాయని, నాణ్యమైన బియ్యం పక్కదారి పట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మార్కెట్‌లో అసలు ఎంత బియ్యం అందుబాటులో ఉందనే విషయంపై స్పష్టత అవసరం. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతపై అధికారులు తనిఖీలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. కొత్త పంట మార్కెట్‌లోకి పూర్తిస్థాయిలో వస్తే సరఫరా పెరిగే అవకాశం ఉంది. అయితే ధరలు తగ్గాలంటే కేవలం కొత్త ధాన్యం రావడమే కాకుండా నిల్వల నిర్వహణ, మార్కెట్ పర్యవేక్షణ కూడా సమర్థంగా జరగాలి. లేకపోతే సామాన్యుల నెలవారీ బడ్జెట్‌లో బియ్యం ఖర్చు మరింత పెరిగే ప్రమాదముంది.

# బంగారం ఇప్పిస్తే వెండి గద చేయిస్తా..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కొండగట్టు అంజన్న హుండీల్లో ఈసారి డబ్బులు, నగలు మాత్రమే కాదు.. భక్తులు రాసిన ఇంట్రెస్టింగ్ లెటర్స్ కూడా బయటపడ్డాయి. కొందరు ఉద్యోగం కావాలని కోరుకుంటే, మరికొందరు తమ పిల్లలు బాగా చదువుకోవాలని మొక్కుకున్నారు. ఇంకొందరు రాజకీయ నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరాలని స్వామివారికి లేఖలు రాశారు. జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీలను తెరిచి కానుకలు లెక్కిస్తున్న సమయంలో ఈ ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా భక్తులు తమ కోరికలను మనసులో చెప్పుకుంటారు. కానీ ఇక్కడ కొందరు ఏకంగా పేపర్‌పై రాసి హుండీలో వేశారు. అందులో వ్యక్తిగత సమస్యల నుంచి గ్రామ అభివృద్ధి వరకు ఎన్నో విషయాలు కనిపించాయి. ముఖ్యంగా రాజకీయ హామీలు అమలు కావాలని కోరుతూ రాసిన లేఖ ఆలయ అధికారుల దృష్టిని ఆకర్షించింది. దీంతో అంజన్నకు భక్తులు రాసిన కోరికల చిట్టా ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ లేఖల్లో కరీంనగర్ జిల్లా నారాయణపూర్ గ్రామానికి చెందిన ఓ భక్తుడు రాసిన విషయం ప్రత్యేకంగా నిలిచింది. తమ గ్రామ ప్రజలపై కొండగట్టు ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరుకున్న ఆయన.. గ్రామ సమస్యను కూడా స్వామివారి ముందుంచారు. నారాయణపూర్‌ను ముంపు ప్రాంతంగా గుర్తించాలని, వరద ప్రభావిత గ్రామంగా ప్రకటించాలని వేడుకున్నారు. ముఖ్యంగా హనుమంతుడి సాక్షిగా తమ ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేఖలో పేర్కొన్నారు. సాధారణంగా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులను ఆశ్రయిస్తారు. కానీ ఈ భక్తుడు మాత్రం రాజకీయ నాయకుడు ఇచ్చిన మాట నెరవేరేలా చూడాలని దేవుడినే కోరుకోవడం విశేషం. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ఇలా ఆలయ హుండీ ద్వారా తెలియజేయడం స్థానికంగా చర్చకు దారితీసింది. మరోవైపు పిల్లల భవిష్యత్తు కోసం ఓ తండ్రి రాసిన లేఖ కూడా అందరి దృష్టిని ఆకర్షించింది. తన కుమారుడు, కుమార్తెకు మంచి తెలివితేటలు ప్రసాదించాలని కొండగట్టు అంజన్నను వేడుకున్నారు. అంతేకాదు, తన భార్యాపిల్లలు బడికి వెళ్లేలా చూడాలని కూడా కోరారు. ఈ లేఖలో విద్యకు సంబంధించిన కుటుంబ ఆకాంక్షలు కనిపిస్తున్నాయి. పిల్లలు బాగా చదువుకోవాలని ప్రతి తల్లిదండ్రులూ కోరుకుంటారు. కానీ చదువుకు అవసరమైన పరిస్థితులు కల్పించుకోవడం కూడా కొన్ని కుటుంబాలకు సవాల్‌గా మారుతుంది. అలాంటి సమయంలో తమ సమస్యలను దేవుడితో పంచుకోవడం భక్తులకు ఓ నమ్మకంగా ఉంటుంది. ముఖ్యంగా చదువు, కుటుంబ బాధ్యతలు, పిల్లల భవిష్యత్తు వంటి విషయాలను స్వామివారికి లేఖ రూపంలో చెప్పుకోవడం ఆసక్తికరంగా మారింది. ఇలా హుండీలో దొరికిన లేఖలు భక్తుల వ్యక్తిగత జీవితాల్లోని ఆశలు, ఆలోచనలను బయటపెడుతున్నాయి. ఇక మరో భక్తుడు రాసిన లేఖలో మాత్రం కోరికల లిస్ట్ చాలా పెద్దగానే ఉంది. తనకు డీపీవోలో ఉద్యోగ రీపోస్టింగ్ ఇప్పించాలని అంజన్నను కోరుకున్నారు. అంతటితో ఆగకుండా బంగారం, సెల్‌ఫోన్, నగదు కూడా తనకు దక్కేలా చూడాలని మొక్కుకున్నారు. అయితే ఈ కోరికలన్నీ నెరవేరితే స్వామివారికి ప్రత్యేకంగా కానుక సమర్పిస్తానని మాటిచ్చారు. ఏకంగా రెండు తులాల వెండితో గద తయారు చేయించి ఆలయానికి అందజేస్తానని లేఖలో రాశారు. హనుమంతుడికి గద ప్రత్యేకమైన ఆయుధంగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. అందుకే తన కోరికలు నెరవేరితే వెండి గదను కానుకగా ఇస్తానని ఆ భక్తుడు మొక్కుకున్నారు. ఉద్యోగం నుంచి విలువైన వస్తువుల వరకు అన్నింటినీ ఒకే లేఖలో కోరుకోవడం ఆసక్తికరంగా మారింది. ఇలాంటి లేఖలు భక్తులు స్వామివారిపై పెట్టుకున్న నమ్మకాన్ని తెలియజేస్తున్నాయి. ఇక కొండగట్టు ఆలయానికి వచ్చిన కానుకల లెక్కలు కూడా ఆసక్తికరంగా ఉన్నాయి. గత 76 రోజుల వ్యవధిలో స్వామివారి హుండీల ద్వారా ఏకంగా రూ.1,23,00,984 నగదు సమకూరింది. అంటే కోటి 23 లక్షల రూపాయలకుపైగా భక్తులు కానుకలుగా సమర్పించారు. ఈ వివరాలను ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి వెల్లడించారు. నగదుతోపాటు హుండీల్లో 68 విదేశీ కరెన్సీ నోట్లు కూడా లభించాయి. మరోవైపు భక్తులు సమర్పించిన బంగారు, వెండి ఆభరణాలను ఈసారి తూకం వేయలేదు. వాటిని ప్రత్యేక సంచుల్లో భద్రపరిచి, సీల్ వేసి తిరిగి హుండీల్లోనే ఉంచినట్లు ఈవో తెలిపారు. మొత్తానికి కొండగట్టు అంజన్న హుండీ లెక్కింపులో భారీ ఆదాయంతోపాటు భక్తుల వినూత్న మొక్కులు కూడా వెలుగులోకి వచ్చాయి. కొందరు కుటుంబ సంతోషం కోసం, మరికొందరు ఉద్యోగం కోసం, ఇంకొందరు తమ గ్రామ సమస్యల పరిష్కారం కోసం స్వామివారిని వేడుకోవడం విశేషం.

# ముఖ్యమంత్రి అధికారంలో ఉండొద్దు

**మొదటిపేజీ తరువాయి**

త్యాగాలను గుర్తు చేసుకున్నారు. జల్, జమీన్, జంగల్ నినాదంతో ఆదివాసీలు సాగించిన పోరాటాన్ని ప్రస్తావించారు. ఇంద్రవెల్లి కాల్పుల ఘటనలో ఆదివాసీలపై జరిగిన దాడులకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆరోపించారు. ఆ ఘటనకు సంబంధించిన స్మారక స్థూపం ఉన్న ప్రాంతంలో కాంగ్రెస్ నేతలు క్షమాపణ కోరిన తర్వాత కూడా ఆదివాసీలు రాజకీయంగా అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చిందని కవిత విమర్శించారు. ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి అంశాలనే తమ రాజకీయ కార్యాచరణకు కేంద్రంగా చేసుకుంటున్నట్లు ప్రకటించారు. ఇక ఆదిలాబాద్ జిల్లా వెనుకబాటుతనాన్ని ప్రస్తావిస్తూ కవిత చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రంగారెడ్డిలో తలసరి ఆదాయం సుమారు రూ.11 లక్షలు ఉంటే, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.2 లక్షలు కూడా లేదని ఆమె పేర్కొన్నారు. ఒకప్పుడు రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం అందించిన ఈ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి సూచికల్లో 27వ స్థానానికి పడిపోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి రెండు నెలలకు ఒకసారి జిల్లాకు వస్తానని చెప్పి, మూడేళ్లలో కేవలం రెండుసార్లు మాత్రమే వచ్చారని ఆరోపించారు. మరోవైపు జిల్లాలో సుమారు 750 గ్రామాలకు కనీసం పాఠశాలలు కూడా లేవని చెబుతూ విద్యా రంగంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఐటీడీఏ పరిధిలో జీవో 57 సహా 27 జీవోలను తిరిగి అమలు చేయాలని, 1972లో ఆస్తులు కొనుగోలు చేసిన ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళల్లో రక్తహీనత, పోషకాహార లోపం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల దుస్థితిని కూడా ప్రస్తావించారు. అభివృద్ధి, విద్య, వైద్యం, ఆదివాసీ సంక్షేమం వంటి అంశాల్లో జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యం అవసరమనే అంశాన్ని తన ప్రసంగంలో ముందుకు తీసుకొచ్చారు. సాగునీటి అంశం కవిత ప్రసంగంలో అత్యంత కీలకంగా కనిపించింది. కాగజ్‌నగర్ ప్రాంతంలో లక్షా ఐదు వేల ఎకరాలకు నీళ్లు అందాల్సి ఉండగా, కేవలం ఆరు వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని ఆమె ఆరోపించారు. కేపీ రావు, జగన్నాథ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తయితే సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని, 12 ఏళ్లుగా ఈ ప్రాజెక్టు పేరు రాజకీయ చర్చల్లో వినిపిస్తున్నప్పటికీ నిర్మాణం ముందుకు సాగలేదని విమర్శించారు. ఇప్పుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చలకు వెళ్లడం కంటే గతంలో జరిగిన ఒప్పందాలు, ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులను యాసంగిలో వరి సాగు చేయవద్దని సూచిస్తున్న ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన మద్దతు, మార్కెటింగ్, ఆదాయ భరోసా కల్పించాలని అన్నారు. మరోవైపు చనఖాకొరటా ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.368 కోట్ల నుంచి రూ.2,100 కోట్లకు పెరిగిందని ప్రస్తావిస్తూ, ఈ పెరుగుదల వెనుక ఉన్న కారణాలు, ఖర్చుల వివరాలను బయటపెట్టాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టుల ఆలస్యం, వ్యయాల పెరుగుదల, రైతులకు నీటి లభ్యత వంటి అంశాలు జిల్లాలో రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. ఇదే సమయంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై కూడా కవిత విమర్శలు చేయడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ఆదిలాబాద్‌కు యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీ ఎందుకు అమలు కాలేదని, పదేళ్లలో ఒక్క యూనివర్సిటీ లేదా ఇంజినీరింగ్ కళాశాల కూడా ఎందుకు తీసుకురాలేదని కేటీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లుకు ప్రైవేట్ వ్యక్తులకు భారీగా నిధులు ఇచ్చినా కార్మికుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం దక్కలేదని ఆరోపించారు. నిజామాబాద్ షుగర్ ఫ్యాక్టరీ, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పునరుద్ధరణ విషయంలోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు చేశారు. పత్తి ఉత్పత్తికి పేరుగాంచిన ఆదిలాబాద్‌లో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయకపోవడంపై గత పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్‌ను నిలదీశారు. ఈ వ్యాఖ్యల ద్వారా కవిత కేవలం ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలనే కాకుండా, గత పాలనలో పరిష్కారం కాని సమస్యలను కూడా రాజకీయ చర్చలోకి తీసుకొచ్చారు. ముఖ్యంగా స్థానిక యువతకు ఉన్నత విద్య, కార్మికులకు ఉపాధి, రైతులకు సాగునీరు, పత్తి రైతులకు స్థానికంగా పరిశ్రమలు కల్పించాలనే అంశాలను ప్రస్తావించారు. మొత్తంగా ఇంద్రవెల్లి వేదికగా కవిత చేసిన ప్రసంగాన్ని పరిశీలిస్తే, ఆదివాసీ ఆత్మగౌరవం నుంచి సాగునీటి సమస్యల వరకు, విద్య నుంచి పరిశ్రమల వరకు అనేక స్థానిక అంశాలను ఒకే రాజకీయ వేదికపైకి తీసుకొచ్చినట్లు కనిపిస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై నిలదీస్తూనే, మరోవైపు బీఆర్ఎస్ గత పాలనలో జరిగిన అభివృద్ధి, నిధుల కేటాయింపులపై కూడా వివరణ కోరారు.

## బెడిసికొట్టిన మంత్రి వ్యూహం..

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీలో ఏకంగా ముఖ్యమంత్రి పదవి కోసం ఎవరైనా పోటీపడుతారు. ఆర్థికంగా బలంగా ఉండి, అధిష్ఠానంలో అండగా ఉండేవాళ్లుంటే చాలు. అలాంటి వారికి ఆ పదవి అందని ద్రాక్ష ఏమీకాదు. ఇప్పుడు రాష్ట్రంలోని ఓ కీలక మంత్రి ఇదే వ్యూహంతో ముందుకెళ్లారు. ముఖ్యనేత అలర్ట్ కావడంతో ఆ మంత్రి వ్యవహారం బెడిసికొట్టింది. ముఖ్యమంత్రి పదవికి ప్రయత్నిస్తే సొంత శాఖలోనే మాట నెగ్గకుండా అవుతున్నది. సొంత ప్రభుత్వంలో స్వలాభం కోసం చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ దశలోనే భారీగా నిధులొచ్చే అవకాశం ఉన్న ఓ ఫైల్‌ను పంపితే ఆ ముఖ్యనేత తిరస్కరించాడు. ఫలితంగా శాఖలో, పార్టీలో, సొంతంగా.. ఉపయోగం లేని చోట ఉండటం ఎందుకనే ఆలోచనకు ఆ మంత్రి వచ్చారు. మంత్రితోపాటు ఓ ఎంపీ ఇదే ఆలోచన చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని ఆ కీలక మంత్రికి దశాబ్దాలుగా అధికార కాంగ్రెస్ పార్టీలోని పెద్ద నేతలతో పరిచయాలు ఉన్నాయి. అదే పరిచయాలతో కాంగ్రెస్ అధిష్ఠానంలోని ఓ కీలక నేతకు దగ్గరయ్యారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యనేత వ్యవహారశైలి బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేసే అ అధిష్ఠానం కీలకనేత మాట సాయం చేస్తానని సదరు మంత్రికి హామీ ఇచ్చారు. ఆ మంత్రి ఆర్థికంగా బలంగా ఉండటంతో ముఖ్యమంత్రి పదవి దక్కవచ్చని గట్టిగానే ప్రయత్నించారు. పెద్ద పదవి కోసం మంత్రి చేస్తున్న ఆ ప్రయత్నాలు ముఖ్యనేతకు తెలిశాయి. వెంటనే అలర్ట్ అయ్యాడు. అసెంబ్లీ ఎన్నికల ముందు తానే పార్టీలోకి ఆహ్వానిస్తే ఇప్పుడు తన పదవికే ఎసరు తెచ్చేలా వ్యవహరించడం ముఖ్యనేతకు ఆగ్రహం తెప్పించింది.

# ఖైరతాబాద్ దానం నాగేందర్‌దే!

**మొదటిపేజీ తరువాయి**

ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం ద్వారా కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహాన్ని స్పష్టం చేసినట్లయింది. ముఖ్యంగా హైదరాబాద్ రాజకీయాల్లో కీలకమైన ఈ నియోజకవర్గంలో గెలుపు కోసం పార్టీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు తెలంగాణలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుందనే సంకేతాలు ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర సంపదను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో అనేకమంది యువత ప్రాణాలు కోల్పోవడానికి కేసీఆర్ రాజకీయాలే కారణమని విమర్శించారు. ఆ పరిణామాల ప్రభావం ఆయన రాజకీయ జీవితాన్ని వెంటాడుతుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో జరిగిన తప్పులకు ప్రజలే సమాధానం చెబుతారని, మరోసారి ఓటమి తప్పదని అభిప్రాయపడ్డారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలను తప్పుబట్టారు. ప్రాజెక్టు సమస్యలను అర్థం చేసుకోకుండా రాజకీయ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో ముఖ్యమైన అంశాలపై చర్చించాల్సిన సమయంలో బీఆర్ఎస్ నాయకులు సభ నుంచి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. ప్రజలకు సంబంధించిన కీలక సమస్యలపై చర్చించేందుకు ప్రతిపక్షం ముందుకు రావాలని సూచించారు. ఇక తన రాజకీయ ప్రయాణం, వ్యక్తిగత జీవితం గురించి కూడా రేవంత్ రెడ్డి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తాను చిన్నప్పటి నుంచే ఆర్థికంగా స్థిరమైన కుటుంబం నుంచి వచ్చానని, కేసీఆర్ కంటే తానే శ్రీమంతుడినని చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత సంపాదించుకోవాల్సిన అవసరం తనకు లేదనే భావనను వ్యక్తం చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి క్యాబినెట్‌లోనూ మంత్రిగా పనిచేయలేదని గుర్తుచేశారు. తన రాజకీయ ప్రయాణాన్ని తానే నిర్మించుకున్నానని వివరించారు. మరోవైపు తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య తనకు పూర్తిగా అర్థమైతే దాన్ని పరిష్కరించేందుకు వెనుకాడనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో అనుబంధ సంఘాల నుంచి ఎదిగిన నాయకులకు కూడా కీలక పదవులు ఇచ్చామని గుర్తుచేశారు. రాజకీయాలు, అభివృద్ధిని ఎప్పుడూ కలిపి చూడనని స్పష్టం చేశారు. ప్రజలకు ఉపయోగపడే పనులను రాజకీయ కారణాలతో ఆపే ప్రసక్తే లేదని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టు భద్రత విషయంలో రాజకీయ నిర్ణయాల కంటే నిపుణుల సూచనలకే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై విశ్లేషణ కొనసాగుతోందని తెలిపారు. ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రాజెక్టుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులు, పూర్తయి వినియోగంలోకి వచ్చిన ప్రాజెక్టులకు వర్తించే నిబంధనల్లో తేడాలు ఉంటాయని వివరించారు. ప్రాజెక్టు పూర్తయి కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత డ్యామ్ సేఫ్టీ అథారిటీ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. కాళేశ్వరం విషయంలో తుది నిర్ణయం తీసుకునే ముందు సాంకేతిక నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ అంశాన్ని రాజకీయ విమర్శలకే పరిమితం చేయకుండా ప్రాజెక్టు భద్రతపై దృష్టిపెట్టాలని సూచించారు. హైదరాబాద్ అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలోనూ రేవంత్ రెడ్డి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. కేబీఆర్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు నిర్మించాలని భావించి వన్‌వే విధానం అమలు చేశామని చెప్పారు. అయితే ఆ మార్పుతోనే ట్రాఫిక్ సమస్యకు కొంత పరిష్కారం లభించిందని వివరించారు. మరోవైపు హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అంశంపైనా స్పందించారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందుకోసం ఎల్ అండ్ టీతో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణానికి క్లియరెన్స్ కూడా వచ్చిందని చెప్పారు. అయినప్పటికీ రుణం మంజూరయ్యే ప్రక్రియలో అడ్డంకులు ఎదురవుతున్నాయని విమర్శించారు. తాము కేంద్ర మంత్రులను కలిసిన వెంటనే కేటీఆర్ కూడా వారిని కలుస్తున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో చేయలేని అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని, ఎన్ని రాజకీయ అడ్డంకులు ఎదురైనా ప్రజలకు అవసరమైన ప్రాజెక్టులను కొనసాగిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## తల్లి మందలించిందని మనస్తాపం.. 23వ అంతస్తు నుంచి దూకి బాలిక మృతి

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

తల్లి మందలించిందనే మనస్తాపంతో ఓ ఇంటర్ విద్యార్థిని అపార్ట్‌మెంట్‌లోని 23వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. చిన్నపాటి విషయానికే బాలిక ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేటలోని ప్రెస్టీజ్ బ్రోవలి హిల్స్ అపార్ట్‌మెంట్‌లో లాస్య లహరి (15) తన తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటోంది. ఆమె మాదాపూర్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. అయితే ఇటీవల కొంతకాలంగా కళాశాలకు వెళ్లకపోవడంతో తల్లి ఆమెను మందలించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తల్లి మందలింపుతో మనస్తాపానికి గురైన బాలిక తీవ్ర ఆవేదనకు లోనైనట్లు సమాచారం. ఈ క్రమంలో గురువారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో అపార్ట్‌మెంట్‌లోని 23వ అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనతో అపార్ట్‌మెంట్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది. బాలికను ఆ స్థితిలో చూసిన కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు మృతురాలి తల్లిదండ్రులతో పాటు స్థానికులను విచారించి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడించారు. పిల్లలు చదువు, కళాశాల హాజరు, వ్యక్తిగత సమస్యల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు తల్లిదండ్రులు వారితో ఓపికగా మాట్లాడి సమస్యకు కారణాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మందలింపుల కంటే ఆప్యాయతతో కూడిన మాటలు, మానసిక ధైర్యం వారికి ఎంతో అవసరం. పిల్లల్లో కనిపించే మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి సంకేతాలను తల్లిదండ్రులు గుర్తించి వారికి అండగా నిలవాలని ఈ విషాద ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

## మొండి గౌరెల్లి భూ నిర్వాసితులకు చెక్కుల పంపిణీ

- 19 మంది రైతులకు రూ 8.07 కోట్ల చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండల పరిధిలోని మొండి గౌరెల్లి భూ నిర్వాసితులకు శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఆర్డిఓ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా 19 మంది రైతులకు రూపాయలు 8.07 కోట్లు. ఎకరాలు 26.36 గుంటల భూమికి చెక్కుల పంపిణీ అందజేశారు. మిగతా రైతులకు కూడా విడతల వారిగా చెక్కులు పంపిణీ అందజేస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డిఓ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొలన్ రమాదేవి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ బడే కుమార్, తాండ్ర రవీందర్, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు మోటె శ్రీశైలం, ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి, యాచారం సిఐ నందీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## కోకాపేట్ శాంతినగర్‌లో వన్ డే – వన్ వార్డ్ కార్యక్రమం

- ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం.. డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి హామీ

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

నార్సింగి సర్కిల్ -45 పరిధిలో ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో చేపట్టిన వన్ డే - వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా గురువారం కోకాపేట్‌లోని శాంతినగర్‌లో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శాంతినగర్‌లో సుమారు 150 నుంచి 200 కుటుంబాలు కాలుష్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ పైపులైన్లలో తరచూ మురుగునీరు నిలిచిపోవడం, తాగునీటి సరఫరాలో సమస్యలు, వీధి దీపాలు సరిగా పనిచేయకపోవడం వంటి సమస్యలను వివరించారు. అదేవిధంగా నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక పాఠశాలలో విద్యార్థుల అవసరాల దృష్ట్యా భూగర్భ నీటి నిల్వ సంపు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా వన్ డే - వన్ వార్డ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ విజయ్ బాబు, డీఈ ఎల్. అన్వేష్ రెడ్డి, ఏఈఈ సంతోష్, వార్డు అధికారి ప్రభాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అరుణ్, పారిశుద్ధ్య వనరుల ప్రతినిధి లచ్చిరామ్, బిల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

**అశ్వాపురం, విశాల భారతి :**

చోరీ కేసులో అశ్వాపురం పోలీసులు గురువారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి అశ్వాపురం సీఐ సిలివేరు ఎల్లయ్య తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. మండలంలోని సీతారామపురం గ్రామంలో సెప్టెంబర్ నెలలో తెల్లవారుజామున బొల్లు సరోజినమ్మ ఇంట్లోకి వెళ్లిన దొంగలు ఆమె మెడలోని 3 తులాల బంగారు గొలుసుతో పాటు రూ.50 వేల నగదును అపహరించుకు వెళ్లారనే పిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈనెల 28 సాయంత్రం గొల్లగూడెం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, బైక్ మీద అనుమానాస్పదంగా వెళ్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన మల్కనగిరి జిల్లా ప్రస్తుతం అశ్వాపురం మండలంలోని గొల్లగూడెం లో ఉంటున్న రేవు సురేష్, ఎటపాక మండలానికి చెందిన గొంది ముత్తయ్య, ఒడిశా లోని మల్కన్గిరి జిల్లా బినాయకపురం గ్రామానికి చెందిన సల్బమ్ చిన్న అనే ముగ్గురిని పట్టుకొని విచారణ చేయగా వారు సీతారామపురం గ్రామంలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. దీంతోపాటు చుంచుపల్లి పరిధిలో మరొక దొంగతనం చేసినట్లు తేలిందన్నారు. నిందితుల నుండి బంగారం వస్తువులు స్వాదీనం చేసుకొని మణుగూరు కోర్టులో హాజరు చేసినట్లు సీఐ తెలిపారు.

# ధరాఘాతం షరా మామూలే....!

- ధరల భారంతో సతమతం అవుతున్న సామాన్యుడు
- ఆకాశాన్ని అంటుతున్న బియ్యం ధరలు
- మార్కెట్లలో మండుతున్న కూరగాయల రేట్లు
- చాలీచాలని ఆదాయంతో కష్టతరంగా సగటుజీవి జీవనం
- నియంత్రించాల్సిన అధికారుల జాడ ఎక్కడ...?

- (కొడారి వెంకటేశ్వర్లు)

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :**

మారుతున్న కాలాన్ని కనుగుణంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే సగటు మనిషి ఆదాయానికి అనుకూలంగా నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ నేటి పరిస్థితుల్లో వేతనాలు ఒకవైపు, ఖర్చులు మరోవైపు పరుగులు తీస్తుండటంతో సామాన్య కుటుంబాలు ఆర్థిక ఒత్తిడితో అల్లాడిపోతున్నారు. బియ్యం, పప్పులు, వంటనూనె, ఉల్లిగడ్డలు, కూరగాయలు వంటి నిత్యావసర వస్తువుల కొనుగోలుకే సామాన్యుడికి జీవన భారమవుతుంది. దీంతో ఇతర అవసరాలకు డబ్బులు సరిపోక అనేక కుటుంబాలు పైసా వెనక చేసుకోలేక అత్యవసరలకు అవస్థలు పడుతున్నారు.

**సామాన్య దినసరి కూలలో పెరుగుతున్న ఆందోళన !:**

రోజువారీ కూలీపై ఆధారపడే కార్మికులు, ప్రైవేటు ఉద్యోగులు, చిరుద్యోగులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని మోయలేక ఇబ్బందులు పడుతున్నాయి. కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఒకరే ఉండి, ఆధారపడే సభ్యులు ఎక్కువగా ఉన్నప్పుడు పరిస్థితి మరింత దారుణమైన పరిస్థితుల్లోకి మారుతోంది. నెల ప్రారంభంలో వచ్చే జీతం, కూలీ డబ్బులు ఇంటి అద్దె, సరుకులు, విద్యుత్ బిల్లు, పిల్లల చదువులు, వైద్య అవసరాలకే సరిపోని పరిస్థితులు కనిపిస్తున్నాయి. కడుపు, కాలు నొప్పి అంటూ ఒక్కసారి కార్పొరేట్ వైద్యశాల వైపు వెళితే అక్కడ జరిగే వైద్య ఖర్చులకు నిరుపేద రోగులు నూరేళ్ళ పెడుతున్నారు.

**పూర్వకాలమే పర్వాలేదు అంటున్న సామాన్యులు :**

ఒకప్పుడు నెలకు సరిపడా సరుకులు కొనుగోలు చేసి కొంత మొత్తాన్ని పొదుపు చేసుకునే కుటుంబాలు, ప్రస్తుతం ఖర్చులను తగ్గించుకోవడానికి నిత్యావసరాల కొనుగోళ్లలోనూ ఆచితూచి వ్యవహరిస్తున్నప్పటికీ చిల్లిగవ్వ చేతిలో ఉండడం లేదని, పూర్వకాలమే కాస్త నయమని సామాన్య ప్రజలు అంటున్నారు. అవసరమైన వస్తువులను ఒకేసారి కొనుగోలు చేయలేక, రోజువారీ వేతనాలతో కొద్దికొద్దిగా తెచ్చుకొని కుటుంబాలు వెల్లదీస్తున్నామని రోజువారి కూలీలు చెబుతున్నారు.

**ఆకాశానందుతున్న బియ్యం ధరలు :**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరి సాగు దిగుబడి అధికంగా వస్తున్నప్పటికీ సాధారణ, మేలురకం బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బియ్యం నిల్వలు అత్యధికంగా ఉన్నప్పటికీ వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారా...? మిల్లర్లు అందరూ ముక్కుమ్మడిగా ఒక్కటై బియ్యం రేట్లను ఆకాశాలు కంటేలా చేస్తున్నారా అన్న శతాధిక ప్రశ్నలు సామాన్య కుటుంబాలను పట్టి పీడిస్తున్నాయి. నిత్యజీవితంలో ఈ బియ్యం వాడకం కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి నెలకు అవసరమయ్యే మేరకు తప్పకుండా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బియ్యం ధరలు సుమారు రూ. 70 నుండి 80 వరకు మార్కెట్లో ధర పలుకుతోంది. ఇక బియ్యంతో పాటు కందిపప్పు, పెసరపప్పు, మినపప్పు వంటి పప్పు ధాన్యాలు, వంటనూనె, ఉప్పు, చింతపండు, ఇతర వంట సరుకులు కొనుగోలు చేయలేక సగటు మనిషి సతమతమవుతున్నాడు. వీటిలో ఏ ఒక్క వస్తువు ధర పెరిగినా దాని ప్రభావం కుటుంబ బడ్జెట్ పై పడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కూలి కుటుంబాలకు పోషకాహారం మాట దేవుడెరుగు...?:**

ఇక నిరుపేద కుటుంబాలలోని గర్భిణీలు, బాలింతలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఉన్నవారు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలంటే ఇక అది దేవుడికే తెలియాలి అంటున్నారు సామాన్య ప్రజలు. ఖర్చులు తగ్గించుకునే క్రమంలో పప్పులు, పండ్లు, ఇతర పోషకాహార పదార్థాల వినియోగాన్ని తగ్గించాల్సి వస్తే అది కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ఆ ప్రభావం పడుతుందని నిరుపేద కుటుంబాల వారు అంటున్నారు. ధరణిలా పెరుగుతూ ఉంటే ఇక సామాన్యుడి జీవనస్థితిగతి ఏంటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి :**

ఇక ఉల్లి ధర మార్కెట్లో భారీగా పెరిగి సామాన్యుడికి కన్నీళ్లు తెప్పిస్తోంది. సుమారు గత రెండు నెలలుగా ఉల్లిపాయల ధర రూ. 70 నుండి మేలు రకమైన ఉల్లిగడ్డలు అయితే 80 వరకు విక్రయిస్తున్నారు. పచ్చిమిర్చి, టమాటా వంటి కూరగాయల ధరలు మార్కెట్లో మండిపోతున్నాయి. వంద రూపాయలు లేనిదే పూట గడిచే పరిస్థితి లేదని ప్రజలు అంటున్నారు.

**నియంత్రించాల్సిన అధికార జాడ ఎక్కడ అంటున్న జనం :**

సామాన్యుడి జీవన స్థితిగతులకు వ్యతిరేక దిశలో నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని నియంత్రించాల్సిన అధికారులు జాడెక్కడ అని..? ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిరుపేదలు, దినసరి కూలీలకు పెరుగుతున్న ధరలకు వస్తున్న ఆదాయానికి విరుద్ధంగా పరిస్థితులు నెలకొని ఉంటే అదుపు చేయాల్సిన అధికారులు ఎందుకు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ప్రజలంటున్నారు. వ్యాపారులు ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు ముప్పునుండి ఉల్లిగడ్డ వరకు, తినుబండారాల నుంచి మాంసాహారాల వరకు అద్దు అదుపు లేని రేట్లతో ఇస్తాను సారంగా వ్యాపారాలు కొనసాగిస్తూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తుంటే సంబంధిత శాఖల అధికారులు కళ్లుండి కబోది పాత్ర పోషించడం ఏంటని నిరుపేదల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు ధరాఘాతానికి అడ్డుకట్ట వేసి సామాన్య ప్రజల జీవనానికి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ సాయం అందేలా చర్యలు తీసుకోవాలి

- CMRF–LOCల మంజూరుపై OSD వేముల శ్రీనివాస్‌తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్చలు

**ఉప్పల్, విశాల భారతి:** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సహాయం అందించడమే లక్ష్యంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులతో చర్చించారు. ఇందులో భాగంగా CMRF కింద జారీ చేసే లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC) లకు సంబంధించిన అంశాలపై OSD వేముల శ్రీనివాస్‌ను కలిసి వివరించారు.ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సల నిమిత్తం అవసరమైన CMRF-LOCల మంజూరు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఇతర సమస్యలను OSD దృష్టికి తీసుకెళ్లారు.అర్హులైన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఊరట కలిగించేలా LOCల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల ఆరోగ్య అవసరాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి
- ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రులు భాగస్వాములు కావాలి
- ఓటు హక్కు వినియోగించుకునేలా చొరవ చూపాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**విశాల భారతి, ఎల్ బి నగర్:** హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పోస్టాఫీస్ వద్ద నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు తిలక్ రావు, రాకేష్ ఠాగూర్, గంగపుత్ర భాస్కర్, నర్సింహా గుప్తా, జగన్నాథ్ రెడ్డి, తోట రాజశేఖరరెడ్డి, దయానంద్, పార్శపు శ్రీధర్, శ్రీకాంత్, కుమార్, చిత్రం సాయి, ఆనంద్, ప్రసాద్, ప్రకాష్, వెంకట్ రెడ్డి, ఉమామహేశ్వర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ఎక్స్ రోడ్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

- వాహనదారులకు రోడ్డు భద్రతపై పోలీసుల సూచనలు

**మల్కాజిగిరి, విశాలభారతి:** మల్కాజిగిరి ఎక్స్ రోడ్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా ట్రాఫిక్ నియమాల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, ఎస్ఐ శ్రీనివాస్, మల్కాజిగిరి ట్రాఫిక్ ఎస్ఐ రవి కుమార్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో సీటు బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం మరియు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను బాధ్యతగా పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను తగ్గించి విలువైన ప్రాణాలను కాపాడగలమని పోలీసులు సూచించారు.

## ఢిల్లీకి తరలివెళ్లిన యువజన కాంగ్రెస్ శ్రేణులు

- నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ
- జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు
- జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం : యువజన కాంగ్రెస్

**విశాల భారతి, ఎల్ బి నగర్:** ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ ర్యాలీకి తెలంగాణ యువజన కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లాయి. తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల ద్వారా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంతవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం పోరాడుతాయని పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించనున్న ర్యాలీలో తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాటుసారా తరలిస్తున్న మహిళ అరెస్ట్

**విశాల భారతి,కామారెడ్డి :** అక్రమంగా నాటుసారా తరలిస్తున్న మహిళపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుందరెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పోశెట్టి ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ జోన్, కానిస్టేబుళ్లు మహమ్మద్ గోరి, పవన్ తదితర సిబ్బంది శుక్రవారం కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం యెల్లంపేట గ్రామ పరిధిలో రూట్ వాచ్ నిర్వహించారు. ఈ క్రమంలో హీరో యాక్టివా వాహనం (నంబర్ TG 17 BA 5823) పై అక్రమంగా 10 లీటర్ల నాటుసారాను తరలిస్తున్న యెల్లంపేట గ్రామానికి చెందిన గుగులోత్ సుగుణ ను పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అక్రమ నాటు సారా తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. అక్రమ మద్యం కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగిస్తూ ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహిస్తామని తెలిపారు.

## వర్షంలోనూ విజయవంతమైన చలో జవహర్ నగర్ సభ

- డంపింగ్ యార్డును తరలించాలి.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి
- కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- వర్షాన్నిసైతం లెక్కచేయకుండా పాల్గొన్న ప్రజలు

**విశాల భారతి, ఎల్ బి నగర్ :** జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారమే లక్ష్యంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన 'జవహర్ నగర్ జన సంకల్ప యాత్ర' నాలుగో రోజుకు చేరుకుని విజయవంతంగా ముగిసింది. యాత్ర ముగింపు సందర్భంగా జవహర్ నగర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, కళ్లెం నవ జీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి, చింతల అరుణ సురేందర్ యాదవ్, పవన్ కుమార్, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జవహర్ నగర్ డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర కాలుష్య, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు, గాలి కలుషితమై ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే శాస్త్రీయమైన, శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. బాధిత ప్రజలకు అండగా బీజేపీ పోరాటాన్ని కొనసాగిస్తుందని పేర్కొన్నారు. సభ జరుగుతున్న సమయంలో భారీ వర్షం కురిసినప్పటికీ ప్రజలు, మహిళలు, యువకులు, పార్టీ శ్రేణులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా వర్షంలోనే సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు పాల్గొని జవహర్ నగర్ ప్రజల సమస్యల పరిష్కారానికి తమ సంఘీభావం తెలిపారు.

## మాలలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వానికి లేఖ

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావు ను కలిసి వినతిపత్రం అందజేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోపోజు రమేష్ బాబు

**ముషీరాబాద్,విశాల భారతి:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ వల్ల మాల సమాజానికి జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు ను మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోపోజు రమేష్ బాబు కోరారు. నవంబర్ 29న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 29 మాల కులాలతో జరిగే ఆల్ పార్టీ మీటింగ్ కు హాజరుకావాలని కోరుతూ శుక్రవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావు ను తార్నాకలోని ఆయన నివాసంలో కలిసి ఇన్విటేషన్ అందజేశారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాత గ్రూప్ త్రీ లోని మాల 26 ఎస్సీ కులాలకు ఒక్క ఉద్యోగం కూడా రావట్లేదని విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించి రోస్టర్ పాయింట్లు మార్పు చేయాలని దీనికోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి మరింతగా తీసుకెళ్లేందుకు బిజెపి పార్టీ తరపున పోరాటం చేయాలని కోరారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సానుకూలంగా స్పందించారని నవంబర్ 29న జరిగే ఆల్ పార్టీ మీటింగ్ కు హాజరు అవుతానని తెలిపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సలహాదారు సుదమల్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన

**మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్**

**విశాల భారతి, లింగంపేట్ :** లింగంపేట మండలంలోనిబాయంపల్లి గ్రామంలో ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లింగంపేట మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ రైతులు భూసార పరిరక్షణకు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని, పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్య ఎరువులను వినియోగించాలని సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ఎరువులు మరియు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు సంబంధిత డీలర్ల వద్ద తప్పనిసరిగా బిల్లులు తీసుకొని భద్రపరచుకోవాలని తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని, నీటి పొదుపు చర్యలు పాటించాలని సూచించారు. అదేవిధంగా పంటల వైవిధ్యకరణ ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు.

## కాంపౌండ్ ఆల్ నిర్మాణం చేపట్టటం అభినందనీయం

- విశాల భారతి లో ప్రచురించిన వార్తకు స్పందించిన మారుతి కాలేజ్ యాజమాన్యం
- కాంపౌండ్ ఆల్ లేక హాస్టల్ నర్సింగ్ విద్యార్థుల ఆందోళన
- ఆందోళన గమనించిన మహా జన సమితి రాష్ట్ర ఆదివాసి మహిళ కన్వీనర్ కంగాల రమణకుమారి
- మారుతి నర్సింగ్ విద్యార్థులకు కాంపౌండ్ ఆల్ ఏర్పాటు చేయాలని విశాల భారతి పత్రికలులో వార్తా ప్రచురణ
- స్పందించిన మారుతి నర్సింగ్ కాలేజ్ యాజమాన్యం కాంపౌండ్ ఆల్ పూర్తి
- అభినందనలు తెలియజేసిన మహాజన సమితి రాష్ట్ర ఆదివాసి మహిళా కన్వీనర్ కంగాల రమణకుమారి

**భద్రాచలం : విశాల భారతి;**

భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డు నందు చివారు ప్రాంతంలో ఉన్న మారుతి కళాశాల హాస్టల్లో మహిళ విద్యార్థులు నర్సింగ్ అభ్యసించేందుకు హాస్టల్లో ఉంటున్నారు వారికి కాంపౌండ్ హాల్ లేక అభద్రతాభావంతో జీవిస్తున్నారని దిన దిన గండంగా భావిస్తున్నారని మహాజన సమితి రాష్ట్ర ఆదివాసి మహిళ కన్వీనర్ కంగాల రమణకుమారి గుర్తించారు. అదే సందర్భంలో విశాల భారతి దిన పత్రికల్లో వార్తను విద్యార్థులకు జరిగే ప్రమాదాలను వెల్లడించారు. విద్యార్థులకు భద్రత లేదని వారికి ఎటు నుంచి ప్రమాదం పొంచి ఉందో తెలియదని అందుకు కాంపౌండ్ ఆల్ ను ఏర్పాటు చేయాలని మారుతి కాలేజ్ యాజమాన్యానికి తెలియజేసేందుకు ఒక ప్రకటన విడుదల చేశారు. దానికి స్పందించి మారుతీ కళాశాల యాజమాన్యం యుద్ధ ప్రాతిపదికన కాంపౌండ్ హాలును ఏర్పాటు చేయటం అభినందనీయమని ఆమె మారుతి కళాశాల యాజమాన్యానికి ప్రత్యేకమైనటువంటి కృతజ్ఞతలు తెలిపారు. మారుతి కళాశాల హాస్టల్ విద్యార్థుల ఆందోళన ప్రత్యేక వార్తగా ప్రచురించి అధికారులకు ప్రజలకు మారుతి కళాశాల యాజమాన్యానికి తెలిపినందుకు ఆమె పత్రిక యాజమాన్యానికి కూడా ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. కాంపౌండ్ ఆల్ కట్టిన అనంతరం విద్యార్థుల్లో ఆందోళన తగ్గిందని ఇప్పుడు గోడ ఉండటం వలన రక్షణగా నిలిచిందని ఎటువంటి ఆందోళన లేకుండా విద్యార్థులు భద్రంగా ఉంటున్నారని స్టడీ అవర్స్ అనంతరం హాయిగా నిద్రపోవుతున్నారని ఆమె పేర్కొన్నారు. వార్తను ప్రచురించిన విశాల భారతి పత్రిక విలేఖరికి ప్రచురణానికి కారణమైన యాజమాన్యానికి ఆమె ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

# రైతులను ఆదుకోవాలి

- వర్షాభావంతో అన్నదాతలకు తీవ్ర ఇబ్బందులు
- వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో
- తక్షణమే ఆర్థిక సాయం అందించాలి : బొంగు వెంకటేష్ గౌడ్

**విశాల భారతి, ఎల్ బి నగర్ :**

తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. శుక్రవారం ఎల్బీనగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా అనేకమంది రైతులు వ్యవసాయానికి దూరమవుతున్నారని తెలిపారు.

**వ్యవసాయంపై ఆధారపడిన రైతుల్లో ఆందోళన**

కొంతమంది రైతులు బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నప్పటికీ, పంటలు సాగు చేయవద్దని ప్రభుత్వం పదేపదే సూచిస్తుండటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతులు పంటలు పండించుకోలేని పరిస్థితి ఏర్పడితే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆందోళన చెందుతున్నారని అన్నారు. పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, కుటుంబ అవసరాలు, నిత్యావసరాల భారం రైతు కుటుంబాలకు భారంగా మారుతోందని వివరించారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల కష్టాలను అర్థం చేసుకుని వారికి అండగా నిలవాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతు కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**తక్షణమే ఆర్థిక సాయం అందించాలి**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలని, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. రైతులకు ప్రభుత్వం సరైన భరోసా కల్పించకపోతే వారు మరింత నిరాశకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బొంగు వెంకటేష్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నాయకులు డాక్టర్ అవ్వారు వేణు, బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్న శ్రీరాములు, బీసీఎఫ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

## సామ రామ్మోహన్‌రెడ్డి గెలుపునకు కంకణబద్ధులై పనిచేయాలి

- పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి
- ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియలో ఇబ్రహీంపట్నం అగ్రస్థానంలో ఉండాలి
- కాంగ్రెస్ ముఖ్యనాయకులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి దిశానిర్దేశం

**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియపై ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి గారు కాంగ్రెస్ ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో ఆయన 'ఏ ' బ్లాక్ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు గడువు సమీపిస్తున్నందున ఇప్పటి ఎన్‌రోల్‌మెంట్స్ గురించి నాయకులతో ఆరా తీశారు. నియోజకవర్గంలో నమోదు ప్రక్రియపై నాయకులతో చర్చించిన ఎమ్మెల్యే. ఓటర్ల నమోదు ప్రాధాన్యత, అర్హతలు, నమోదు విధానంపై చర్చించారు. మరో వారం మాత్రమే గడువు ఉన్నందున అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా ఎన్రోల్మెంట్ చేయించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజార్టీ సాధించడంలోనూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. సామ రామ్మోహన్‌రెడ్డి గెలుపునకు గ్రామాలు, పట్టణాల వారీగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పందెము వాగు బ్రిడ్జిపై ప్రమాద ఘంటికలు.. అధికారుల నిర్లక్ష్యం

**రాజేంద్రనగర్, విశాల భారతి :** మణికొండ, పుప్పాలగూడ పైప్‌లైన్ రోడ్డులోని పందెము వాగుపై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నార్సింగి సర్కిల్‌కు అనుసంధానంగా ఉన్న ఈ ప్రధాన మార్గంలో నిత్యం రాత్రింబవళ్లు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి రద్దీగా ఉండే రహదారిపై బ్రిడ్జి బీటలు వారడంతో పాటు కుంగిపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఘోర ప్రమాదాన్ని అధికారులు గుర్తు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు సూచిస్తున్నారు. 2021 సెప్టెంబర్ 25వ తేదీ శనివారం రాత్రి గోల్డెన్ టెంపుల్ సమీపంలో స్టార్మ్‌వాటర్ లైన్ నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో పవర్ ప్లాంట్ ఇంజినీర్ రజనీకాంత్ ప్రమాదవశాత్తు గుంతలో పడి గల్లంతై ప్రాణాలు కోల్పోయిన ఘటన అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. ఆ ఘటన నేటికీ ప్రజల మనసుల్లో చెరగని జ్ఞాపకంగా మిగిలిపోయింది. అలాంటి విషాద ఘటన మరోసారి పందెము వాగు బ్రిడ్జి వద్ద పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొంటున్నారు. బ్రిడ్జిపై ఏర్పడిన బీటలు, కుంగిన ప్రాంతాలను తక్షణమే పరిశీలించి ప్రమాద తీవ్రతను అంచనా వేయాలని కోరుతున్నారు. అవసరమైతే మరమ్మతులు పూర్తయ్యే వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లిన తర్వాత స్పందించడం కాకుండా, ప్రమాదం జరగకముందే అధికారులు అప్రమత్తం కావాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్‌రావు, సంగం శ్రీకాంత్, భానుచందర్ సంబంధిత అధికారులను కోరారు. తక్షణమే బ్రిడ్జిని పరిశీలించి పటిష్టమైన మరమ్మతులు చేపట్టాలని, భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.

## సేవాభావంతో గొప్ప వైద్యులుగా ఎదగాలి

- భూపాలపల్లి వైద్య కళాశాలలో వైట్‌కోట్ వేడుకలో పాల్గొన్న మంత్రి
- రూ.15 కోట్లతో నిర్మించిన బాలికల వసతిగృహం ప్రారంభం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**విశాల భారతి, భూపాలపల్లి :**

వైద్య విద్యార్థులు అంకితభావం, సేవా దృక్పథంతో చదివి గొప్ప వైద్య నిపుణులుగా ఎదగాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. దేశానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వైట్‌కోట్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైద్య వృత్తి మానవ సేవకు అంకితమైన బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. వైట్‌కోట్ ధరించడం విద్యార్థుల జీవితంలో ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. అది వైద్య వృత్తిలోని నిబద్ధత, సేవాభావానికి ప్రతీక అని వివరించారు. నీట్‌లో అర్హత సాధించి వైద్య విద్యలో ప్రవేశించిన విద్యార్థుల విజయం వెనుక తల్లిదండ్రుల కృషి, త్యాగం ఉన్నాయని, వారి ఆశయాలను నెరవేర్చేలా ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పుస్తక పరిజ్ఞానంతో పాటు మానవత్వం, రోగుల పట్ల సానుభూతి, సహనం అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. పేదలకు నాణ్యమైన సేవలందిస్తూ వైద్య వృత్తి గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి సాంకేతికతలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. నిరంతర అధ్యయనంతో నైపుణ్యాలను పెంపొందించుకుంటూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎదగాలని కోరారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొని సమగ్ర వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు.

**మౌలిక వసతులకు రూ.130 కోట్లతో పనులు**

వైద్య కళాశాల భవనం, బాలుర, బాలికల హాస్టళ్ల నిర్మాణానికి సుమారు రూ.130 కోట్లతో పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. బాలికల హాస్టల్‌ను ప్రారంభించామని, మరో 15 రోజుల్లో బాలుర హాస్టల్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అంతకుముందు రూ.15 కోట్లతో నిర్మించిన బాలికల వసతిగృహాన్ని ప్రారంభించారు. విద్యార్థుల రవాణా కోసం సింగరేణి సంస్థ ద్వారా రెండు బస్సుల కొనుగోలుకు రూ.80 లక్షలు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్, డీఎంఎఫ్‌టీ నిధుల సహకారంతో త్వరలో బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రధాన భవన నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు అవసరమైన వైద్యులు, అధ్యాపకుల నియామకాలకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సెమినార్ హాళ్లకు ఏసీలు, వాటర్ ప్లాంట్, హాస్టళ్లలో లిఫ్ట్, జనరేటర్, కిచెన్ షెడ్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన పనులను సీఎస్ఆర్ నిధుల సహకారంతో త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాల విద్యార్థుల సంక్షేమంపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

**కళాశాల అభివృద్ధికి సహకారం: ఎమ్మెల్యే గండ్ర**

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. కళాశాలలో మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మంత్రుల సహకారంతో అవసరమైన నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. క్రీడామైదానం, గ్రంథాలయం, తరగతి గదులు, మరుగుదొడ్లు, హాస్టల్ వసతులను మెరుగుపరుస్తామని చెప్పారు. విద్యార్థులు భూపాలపల్లిని తమ సొంత ప్రాంతంగా భావిస్తూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

**91 శాతం ఫలితాలు అభినందనీయం: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. అధ్యాపకుల కృషితో కళాశాల 91 శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. గోదావరి పరివాహక ప్రాంతం, బొగ్గు గనులు, గిరిజన ప్రాంతాలతో కూడిన జిల్లాలో వైద్య సేవలకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు.

# విద్యాభివృద్ధికి పెద్దపీట

- నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
- ఆరుట్ల, మంచాలలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు
- మున్సిపాలిటీల్లోనూ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు సిద్ధం

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

గత పదేళ్లలో నియోజకవర్గం ఎదుర్కొన్న వెనుకబాటుతనాన్ని తొలగించి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకువస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం తొర్రూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

**విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం**

అన్నివర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందినప్పుడే సమాజంలో ఆశించిన మార్పు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. విద్యాభివృద్ధిలో భాగంగా తొలివిడతలో ఆరుట్లలో, రెండో విడతలో మంచాలలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇదే తరహా విద్యాకేంద్రాలను మున్సిపాలిటీల పరిధిలోనూ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. తొర్రూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తన సోదరి వంగేటి భూదేవమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు నిర్మించిన సభావేదికను రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా మిట్ట ఫ్యామిలీ ఫౌండేషన్ సౌజన్యంతో కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సంస్థ ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ముందుకొచ్చిన దాతలను ఎమ్మెల్యే అభినందించారు. తొర్రూర్ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైన మిట్ట ఫ్యామిలీ ఫౌండేషన్ ప్రతినిధుల సేవలను ప్రశంసించారు. విద్యాసంస్థల అభివృద్ధికి దాతలు, ప్రజలు భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మిట్ట ఫ్యామిలీ ఫౌండేషన్ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎండిన పంట పొలాల పరిశీలన

- కరెంట్ కోతలను నివారించాలి
- మంచాల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి
- బిఅర్ ఎస్ పార్టీ మంచాల మండల అధ్యక్షుడు చీరాల రమేష్

**విశాలభారతి, ఇబ్రహీంపట్నం:**

మంచాల మండలం బిఅర్ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ఆధ్వర్యంలో మంచాల జపాల ఆరుట్ల గ్రామాలలో నీళ్లు లేక ఎండిపోయిన పంటలను పరిశీలించిన బిఆర్ఎస్ పార్టీ బృందం. రైతులు మాట్లాడుతూ వర్షలులేక ఆందోళన చెందుతున్న క్రమంలో కనీసం బోరు బావులలో లేక తినడానికి సరిపడ పంటపండించుకుందా మంటే లో ఓల్టేజ్ కరెంట్ సమస్యతో బోర్ మోటార్లు కాలిపోవడం మాకు పెద్ద ఇబ్బంది కలుగుతుందని రైతులు తమ బాధలను, గోసను బిఅర్ఎస్ పార్టీ బృందానికి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఅర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య మంచాల వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సమయాన్ని తగ్గించడమే కాకుండా వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ రాక అప్పుడప్పుడు విద్యుత్‌కు అంతరాయం కలగడం వల్ల రైతులు నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైతులకు వ్యవసాయానికి విద్యుత్ నిరంతరం ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేసామని రైతులకు సరైన సమయానికి రైతు బంధు డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలో వేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరాచేయాలని మంచాల మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించి ప్రకటన చేయాలనీ, ఎండిన పంటలకు వెంటనే నష్ట పరిహారం అందించాలని లేదంటే బిఅర్ఎస్ పార్టీ ముందుండి రైతులపక్షాన రైతులతో కలిసి ప్రభుత్వంపైన పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంచాల మండలం మాజీ ఎంపీపీ మంకు ఇందిర మాజీ వైస్ మంచాల సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ దండేటికార్ రవి మాజీ డైరెక్టర్ జంబుల కిషన్ రెడ్డి పటేల్ చెరువుతండా మాజీ సర్పంచ్ రాజునాయక్ ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభకుమార్ జాపాల గ్రామసర్పంచ్ మంచాల రవి బిఅర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిందం రఘుపతి మొర్రి ఐలయ్య ఆరుట్ల గ్రామపంచాయతీ వార్డుసభ్యులు మాడుగుల బాలమణి పున్నం రాము నాయకులు జీఎంపీస్ చెర్మన్ చిందం జంగయ్య బకున చందు ఆకారం కృష్ణ లచ్చిరాం ఆవుల శ్రీను గుంతండ్ల మల్లేష్ బర్మల వెంకటేష్ కాటి కృష్ణ అశ్వాల బాలరాజ్ మెగావత్ గణేష్‌నోముల మధు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం,షూస్ పంపిణి

**విశాల భారతి, నారాయణఖేడ్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం తడ్కల్ జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ సుగుణ మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సమీర్, ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అంజన, వీరేశంతో కలిసి విద్యార్థులకు యూనిఫాం షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్య అభివృద్ధికి అవసరమైన సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్, షూస్ మాత్రమే కాకుండా ప్రతి విద్యార్థి కల సహకారం చేసే బాధ్యతని అన్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట

- ప్రధాని మోదీ నాయకత్వంలో రైతులకు నేరుగా ఆర్థిక భరోసా
- బండి సంజయ్

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని రాజేంద్రనగర్‌లోని భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్) కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అమలు చేస్తూ నేరుగా రైతుల ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ చేస్తోందని తెలిపారు. దేశ వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల ఆదాయం పెంపునకు, వారి ఆర్థిక సాధికారతకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించడం ద్వారా వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తోందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేస్తోందని, రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**విశాల భారతి, భూపాలపల్లి :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య వేదాశీర్వచనం అందించారు. తీర్థప్రసాదాలు, శేషవస్త్రంతో పాటు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. అంతకుముందు ఆలయ పరిసరాల్లో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను మంత్రి పరిశీలించారు. నిర్మాణ పనులు, నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటు నమోదుపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి
- నవంబర్ 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ
- గ్రామాలు, వార్డుల్లో విస్తృత అవగాహన కల్పించాలి

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కు పొందేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని సూచించారు. శుక్రవారం పెద్ద అంబర్‌పేట్‌లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించి, అనంతరం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు.

**అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి**

2023 అక్టోబర్ 31వ తేదీలోపు డిగ్రీ లేదా దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవడానికి అర్హులని నాయకులు తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారితో పాటు గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం మరోసారి నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. 2026 నవంబర్ 6వ తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ప్రతి గ్రామం, వార్డులో అవగాహన కల్పించాలి**

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పర్యటించి పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అర్హులైన ఒక్క పట్టభద్రుడు కూడా ఓటు నమోదు చేసుకోకుండా మిగిలిపోకూడదని, ఈ దిశగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశం, ప్రెస్‌మీట్‌లో మాజీ మున్సిపల్ చైర్మన్ ఈదమల్ల బలరాం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్లు గౌని భాస్కర్ గౌడ్, పాశం అర్చన దామోదర్, దేసారం బాలకృష్ణ గౌడ్, మండల కోటేశ్వర్ రావు, తొండెపు రోహిణి బ్రహ్మానంద రెడ్డి, పిల్లి అమరావతి నాగేష్ యాదవ్, సీనియర్ నాయకులు పొగాకు నర్సింహ గౌడ్, గోషికొండ రాజిరెడ్డి, వెల్డింగ్ వెంకట్ రెడ్డి, మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్, పండుగుల రాము, బీఆర్ఎస్ స్టేట్ సెక్రటరీ అచ్యుత్, జోర్క రాము ముదిరాజ్, నాగరాజు, వెంకటేష్ గౌడ్, యంజాల రాంబాబు, పండుగుల సత్యనారాయణ, జోర్రిగల మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# గ్రామీణాభివృద్ధికి 'వివో' భవనాలు!

- నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- 90 భవనాల పనులు ఇంకా ప్రారంభం కాలేదు
- అధికారులకు, ప్రజాప్రతినిధులకు కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాలు

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చేపట్టిన 'వివో' భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 387 భవనాలు మంజూరు కాగా, 90 భవనాల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో సర్పంచులు, అధికారులతో నిర్మాణ పురోగతిపై చర్చించారు. మంజూరైన ప్రతి భవన నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. భూమిపూజ పూర్తయిన ప్రాంతాల్లో వెంటనే పనులు ప్రారంభించి వేగం పెంచాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. కేటాయించిన నిధులను సమర్థవంతంగా, పారదర్శకంగా వినియోగించేలా ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. వివో భవనాలు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలు అందించే బహుళ ప్రయోజన కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా భవనాల వినియోగంపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వివిజి రాంజీ పథకం ద్వారా గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పాలన, ప్రజలకు సత్వర ప్రభుత్వ సేవలు అందించడమే ఈ భవనాల నిర్మాణ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, పీఆర్ఈఈ, డీపీఓ రేవంత్, డివిజనల్ పంచాయతీ అధికారి పుల్లారావు, ఏపీఓలు, సంబంధిత గ్రామాల సర్పంచులు, వివో అధ్యక్ష, కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పరిసరాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం

- చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం
- టేకుల మంజుల దిలీప్ రెడ్డి సర్పంచ్

**చౌటుప్పల్,విశాల భారతి:** చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా మండలం అల్లాపూరం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం పరిసరాల్లో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రం చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పరిసరాల్లోని చెత్త, చెదారం, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల దిలీప్ రెడ్డి మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రం పరిశుభ్రంగా ఉంటేనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోయిన లింగస్వామి, వార్డు సభ్యులు ఎంజాల లింగస్వామి, ఎంజాల అమృత, భూతం లింగస్వామి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, అంగన్వాడీ టీచర్ అమృత కూడా పాల్గొని శ్రమదానం చేశారు.

## అల్లాపూర్ గ్రామంలో ఘనంగా ఐకెపి సెంటర్ ప్రారంభం

**చౌటుప్పల్,విశాల భారతి:** మండలం అల్లాపూర్ గ్రామంలో గురువారం ఐకెపి సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి, పి ఏ సి యస్ చైర్మన్ ఈదుదుల మస్తాన్ బాబు యాదవ్ హాజరై ఐకెపి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి, ఉప సర్పంచ్ బోయిన లింగస్వామి తో పాటు వార్డు సభ్యులు బూత లింగస్వామి, ఎంజాల అమృత, ఎముదాల లింగస్వామి, కొలను పూలమ్మ, అర్ధ జనార్దన్ రెడ్డి, రేణా తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల అధికారులు, వ్యవసాయ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ...గ్రామంలో ఐకెపి సెంటర్ ఏర్పాటు వల్ల మహిళా సంఘాలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గుడుంబా తయారీ స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం

- తండాల్లో విస్తృత తనిఖీలు
- 25 లీటర్ల గుడుంబా, 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

**చిన్నగూడూర్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** గుడుంబా తయారీ, అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో పోలీసులు తండాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. చిన్నగూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్య తండా, తుమ్మలచెరువు తండాల్లో శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సుమారు 100 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి 25 లీటర్ల గుడుంబాతో పాటు 500 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు.గుడుంబా తయారీ, విక్రయాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామస్థులకు రోడ్డు భద్రతా నియమాలు, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ విస్తృత తనిఖీల కార్యక్రమంలో 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాలకులు ప్రేక్షక పాత్ర వహించడం సిగ్గుచేటు

- పల్లా సుందర్ రాంరెడ్డి



**దేవరుప్పుల విశాలభారతి:** మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు.దేవరుప్పుల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బిఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించగా ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి తహసిల్దార్ మహ్మద్ అశ్వక్ అహ్మద్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పల్లా సుందర్ రాంరెడ్డి మాట్లాడుతూ మా మీద కోపం ఉంటే ఎన్ని కేసులైనా పెట్టు ఎమ్మెల్యే గారు కానీ రైతులకు మాత్రం నీళ్లు ఇవ్వండని,పక్క నియోజకవర్గంలో చూసైనా కనులు తెరవండని,రైతులు సాగునీరు లేక,పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని,దేవరుప్పుల మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని,రైతుల కన్నీళ్లు తుడవాల్సిన పాలకులు ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటని,రైతుల కష్టాలు కనిపించడం లేదా?ఎండిపోతున్న పంటలు కనిపించడం లేదా?రైతులను ఆదుకోకుండా కాలయాపన చేస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని,రైతుల పాపం కాంగ్రెస్ నాయకులకు తప్పకుండా తగులుతుందని,ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,యువజన నాయకులు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

## లోవోల్టేజ్‌కు ఫుల్‌స్టాప్.. ఇందిరానగర్‌కు ఊరట!

- కౌన్సిలర్ సయ్యద్ గఫార్ పర్యవేక్షణలో 15 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**విశాల భారతి / ఎల్లారెడ్డి :** తక్కువ వోల్టేజీతో ఇబ్బందులు పడుతున్న ఇందిరానగర్ కాలనీవాసులకు ఎట్టకేలకు ఊరట లభించింది. శుక్రవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో కౌన్సిలర్ సయ్యద్ గఫార్ చొరవతో 15 కేవీఏ సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌తో వోల్టేజ్ సమస్య తగ్గి, ఇళ్లకు మెరుగైన విద్యుత్ సరఫరా అందనుంది. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కీలక నిర్ణయాలు

- ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీటికి రూ.85 లక్షలు
- తాగునిటీ సమస్య లేకుండా చేయడమే మా ప్రథమ లక్ష్యం
- చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**చౌటుప్పల్,విశాలభారతి:** చౌటుప్పల్ పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం కౌన్సిల్ హాల్‌లో చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**తాగునీటికి పెద్దపీట:**

రానున్న ఎల్ నినో ప్రభావాల నేపథ్యంలో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యగా రూ. 85 లక్షలు కేటాయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా కొత్త బోర్లు తవ్వడం, మోటార్లు, పైప్ లైన్ల ఏర్పాటు, ప్రైవేటు బోర్ల లీజు మరియు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పనులను చేపట్టనున్నారు.

**అభివృద్ధి పనులకు ఆమోదం:**

అలాగే పట్టణంలోని వివిధ వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, ఊర చెరువు పూడిక తీత పనులకు రూ. 1.06 కోట్లు, మున్సిపల్ కార్యాలయ పరిపాలన, నిర్వహణకు రూ. 28.27 లక్షలు కలిపి మొత్తం రూ. 2.28 కోట్ల నిధులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ...మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోసనం రాకేష్ రెడ్డి, పాలేపల్లి లక్ష్మి, పల్లె లావణ్య, ఉడుతల యాదయ్య, కొయ్యడ శేఖర్, ఆరె శైలజ, కాసర్ల మంజుల, బట్టి గాలయ్య, దేవి రమ్య, పాక చిరంజీవి, బత్తుల వాణి, ఉడుగు జ్యోతి, గడ్డం ఇందిర, బత్తుల జయమ్మ, చింతల ఉమామహేశ్వరి, బుడ్డ సురేష్, పిల్లలమర్రి మధుసూదన్, హనుమ మహమ్మద్ మరియు కోఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు, సందగట్ల విజయ, షేక్ సబీనా తదితరులు.అధికారులు ఆర్ఎంఓ డా. డి. చంద్రశేఖర్, ఎఫ్యస్ఓ ఎం. గోవర్ధన్, ఏఈఈ లు బి. నవీన్, జి. శ్రీలక్ష్మి, ఎంఈఓ ఇ. గురువారావు, ఈఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- మహిళా సంఘాల సభ్యులకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచన

**ఆలేరు, విశాలభారతి:** మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ వివిధ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సంఘం (సంఘబంధం) సమావేశం, మహిళా సంఘాల సభ్యుల ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి మహిళలతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, బ్యాంకు రుణాలు, రాయితీలు అందిస్తోందని తెలిపారు. మహిళలు తమ నైపుణ్యాలు, ఆసక్తులకు అనుగుణంగా కుట్టు శిక్షణ కేంద్రాలు, కిరాణా దుకాణాలు, కంప్యూటర్ కేంద్రాలు, డ్రోన్ సేవలు, వ్యవసాయ అనుబంధ వ్యాపారాలు వంటి స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా మహిళలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి, అర్హతను బట్టి స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకు రుణాలు, రాయితీలు పొందేలా మార్గదర్శకత్వం కల్పిస్తామని చెప్పారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పాఠశాల యూనిఫామ్‌ల తయారీ, క్యాంటీన్ల నిర్వహణ వంటి ఉపాధి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సాంకేతిక కారణాలతో కొందరి వైద్య పరీక్షల నివేదికలు ఆలస్యమైనప్పటికీ, త్వరలోనే సంబంధిత మహిళలందరికీ పూర్తి నివేదికలు అందజేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్, ఆలేరు సహాయ ప్రాజెక్టు అధికారి, గ్రామ సర్పంచ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- ప్రభుత్వ విప్ విజయరమణారావు

**విశాల భారతి ఓదెల :** రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని గుండ్లపల్లి, కనగర్తి, ఓదెల, పొత్కపెల్లి, జీలకుంట గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సుమన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి, సర్పంచులు పుప్పాల పుష్పశంకర్, చొప్పరి సంధ్యకుమార్, ఆవాల ప్రసాద్, కనికిరెడ్డి సతీష్, అంబాల సారమ్మ, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫామ్ పాండ్‌లతో రైతులకు బహుళ ప్రయోజనాలు

- నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలి
- పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ఆలేరు, విశాల భారతి:** గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణతో పాటు రైతుల ఆదాయ వృద్ధికి దోహదపడే పనులను విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలో VBG RAM G పథకం కింద రైతు పొలంలో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ పనులను ఆయన పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలతో నేరుగా మాట్లాడి పనుల వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మునగ తోటల పెంపకం, ఫామ్ పాండ్‌ల నిర్మాణం, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, పశువుల షెడ్లు, పశువుల నీటి తొట్లు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కూలీలకు నిబంధనల ప్రకారం రోజుకు రూ.308 కూలి అందేలా పనులు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని, తద్వారా భూగర్భ జలాల అభివృద్ధితో పాటు వ్యవసాయ అవసరాలకు నీటి లభ్యత మెరుగుపడుతుందని వివరించారు. ఇలాంటి నీటి సంరక్షణ, గ్రామీణాభివృద్ధి పనులను అన్ని గ్రామపంచాయతీల్లో ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ నాగిరెడ్డి, ఎంపీడీవో, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తంగడపల్లిలో అక్రమ మద్యం అమ్మకం

**చౌటుప్పల్,విశాల భారతి:** మండలం తంగడపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం నాడు వి. శ్రీనివాస్, హెచ్ సి 1843, పెట్రో మొబైల్ 1 విధులు నిర్వర్తిస్తుండగా... తంగడపల్లి గ్రామంలో అక్రమ మద్యం అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు తంగడపల్లి గ్రామానికి చెందిన రాచకొండ సుజాత, భర్త జంగయ్య, వయసు 34 సంవత్సరాలు, కులం గౌడ్ అనే మహిళ ఇంట్లో తనిఖీ చేయగా... ఆమె ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 15 కేవఫ్ లైట్ బీర్ బాటిల్స్ పట్టుబడ్డాయి. పోలీసులు ఆ బీర్ బాటిల్స్ ను స్వాధీనం చేసుకుని, సదరు మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, చౌటుప్పల్ డి. సతీష్ రెడ్డి తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## దేవులమ్మ నాగారంలో ఘనంగా ఐకెపి సెంటర్ ప్రారంభ

**చౌటుప్పల్,విశాల భారతి:** మండలం దేవులమ్మ నాగారం గ్రామంలో శుక్రవారం ఐకెపి సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి, పి ఏ సి యస్ చైర్మన్ ఈ దుదుల మస్తాన్ బాబు, గ్రామ సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ హాజరై ఐకెపి సెంటర్‌ను ప్రారంభించారు. సందర్భంగా చైర్మన్ ఉబ్బు వెంకయ్య మాట్లాడుతూ... ఐకెపి సెంటర్ ఏర్పాటుతో మహిళా సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ప్రభుత్వం అందిస్తున్న రుణ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- జిల్లా విద్యాధికారి

**యాదాద్రి, విశాల భారతి:** గ్రామీణ ప్రాంతాలకు చెందిన బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాలని జిల్లా విద్యాధికారి బిక్షపతి సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల బీచ్ మహల్‌లో జిల్లాలోని మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జేఈఈ, నీట్‌కు సన్నద్ధం చేసేందుకు సంబంధిత ఉపాధ్యాయులకు విషయ నిపుణులతో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి డీఈవో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల బడుగు, బలహీన వర్గాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి సరైన మార్గదర్శకత్వం అందిస్తే జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధం చేయవచ్చన్నారు. తద్వారా వారు ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు మరెంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పూర్తి ప్రోత్సాహం, సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఎంపిక చేసిన విద్యార్థులు జేఈఈ, నీట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు పక్కా ప్రణాళికతో బోధన సాగించాలని సూచించారు. ఈ ప్రత్యేక శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల విషయ పరిజ్ఞానంతో పాటు బోధనా నైపుణ్యాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ టి. శ్రీహరి, విషయ నిపుణులు లక్ష్మీ నరసింహమూర్తి (గణితం), నకిరేకంటి శ్రీనయ్య (బోటనీ), ఈశ్వర్ రావు (జువాలజీ), శ్రీధర్ రావు, జితేందర్ రెడ్డి (కెమిస్ట్రీ) పాల్గొని ఉపాధ్యాయులకు ఆయా సబ్జెక్టుల్లో ప్రత్యేక శిక్షణ అందించారు.

## ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- చైర్ పర్సన్

**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:** ఎల్‌నినో ప్రభావంతో రానున్న వేసవిలో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రజలు ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ సూచించారు. భువనగిరి పురపాలక సంఘం పరిధిలోని 35 వార్డుల్లో నిర్వహిస్తున్న ఎల్‌నినో వార్డు సభల్లో భాగంగా శుక్రవారం 35వ వార్డులో జరిగిన సభకు ఆమె మాట్లాడారు. వార్డులోని బోరుబావుల పనితీరు, భూగర్భ జలాల లభ్యత, రోజువారీ నీటి సరఫరా సమయాలపై ఆరా తీశారు. నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. నల్లా కనెక్షన్ల వద్ద లీకేజీలు, నీటి సరఫరాకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. చంద్రప్రకాష్ రెడ్డి, వార్డు అధికారి, మున్సిపల్ సిబ్బంది, ఎంఏఈలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎంఆర్ లక్ష్యాల పూర్తిలో నిర్లక్ష్యం వహించొద్దు

- రైస్ మిల్లర్లకు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ స్పష్టమైన ఆదేశాలు

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా కచ్చితంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం కేసముద్రం, గూడూరు మండలాల పరిధిలోని పలు రైస్ మిల్లులను జిల్లా సివిల్ సప్లై అధికారి రమేష్, మేనేజర్ మనోజ్, సంబంధిత అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెనుగొండలోని లక్ష్మీ మోడ్రన్ రైస్ మిల్లు, తీగలవేణిలోని ఎన్‌సీఆర్ రైస్ మిల్లు, ఆర్ఆర్ఆర్, ఏహోవ నిస్స మిల్లులను పరిశీలించారు. మిల్లుల్లో సీఎంఆర్‌కు సంబంధించిన ప్రక్రియ, లక్ష్యాల అమలు తీరును అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం లక్ష్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాల సాధనలో మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఛలో ఢిల్లీ బస్సు యాత్రను ప్రారంభించిన డీసీసీ అధ్యక్షురాలు

**జనగాం, విశాలభారతి:** ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ,నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరగనున్న ఇండియా కూటమి నిరసన ర్యాలీని విజయవంతం చేసేందుకు జనగామ నుంచి ఢిల్లీ బస్సు యాత్రను ప్రారంభించిన జనగామ డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్.వారితో పాటు వైటీడీవి బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, జనగామ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి, జెండా ఊపి,కొబ్బరికాయ కొట్టి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ నరేందర్ పవార్,కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జాయ మల్లేష్,ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ వేముల మల్లేష్ మహారాజ్,దేవరుప్పుల మండల అధ్యక్షుడు దావేరా అనిల్,చిక్కుడు వెంకటేష్,ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్లు బొండుగుల కొమురయ్య,గోసంగి కిషన్,ప్రధాన కార్యదర్శులు పులి శోభన్ బాబు,నీలం ప్రవీణ్,గండి శ్రీను,సేవాదళ్ జిల్లా వైస్ ప్రెసిడెంట్లు కట్కూమ్ ఉదయ్,గుగులోత్ కిషన్ నాయక్,సేవాదళ్ ప్రధాన కార్యదర్శులు మెంతెనా కిష్టయ్య,మామోజు నర్సింహాచారి,దండిగే బలయ్య,సుంకర అనిల్,మోటె మల్లేష్,ఎర్రం సిద్దులు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నెరడ మోడల్ స్కూల్‌లో పోలీస్ డే కార్యక్రమం

- **పోలీసుల సేవలు, అమరవీరుల త్యాగాలపై విద్యార్థులకు అవగాహన**
- **సీఐ అంజలి, ఎస్ఐ సతీష్‌కు ఘన సన్మానం**

**కురవి విశాలభారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా కురవి మండలం నెరడ గ్రామంలోని మోడల్ స్కూల్లో నిర్వహించిన పోలీస్ డే కార్యక్రమానికి మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి, కురవి ఎస్ఐ సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల విధులు, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్ర, ప్రజల రక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవల గురించి విద్యార్థులకు వివరించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సీఐ అంజలి, ఎస్ఐ సతీష్‌లను పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పోలీసుల సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెవైఎం దేవరుప్పుల మండల అధ్యక్షునిగా మూడ అన్వేష్ నాయక్

**దేవరుప్పుల విశాల భారతి:** భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎం)దేవరుప్పుల మండల అధ్యక్షునిగా మూడ అన్వేష్‌నాయక్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా గతంలో బీజేవైఎం మండల నాయకులుగా పనిచేసిన నాకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంపై కృతజ్ఞతలు తెలిపారు.అన్వేష్ నాయక్ మాట్లాడుతూ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని,నా నియామకానికి సహకరించిన బిజెవైఎం జనగామ జిల్లా అధ్యక్షుడు హరీష్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, రాష్ట్ర నాయకులు లేగ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ రెడ్డి , జిల్లా ఉపాధ్యక్షుడు చింత సృజన్ కుమార్, దేవరుప్పుల మండల అధ్యక్షుడు బస్వా భాస్కర్ లకు అన్వేష్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి

- **బయ్యారంలో పోలీసుల సైకిల్ ర్యాలీ**
- **యువతలో దేశభక్తి, క్రమశిక్షణపై అవగాహన**

**బయ్యారం విశాలభారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** దేశ రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ బయ్యారం మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని అమరుల సేవలకు నివాళులర్పించారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దేశ సరిహద్దుల వద్ద విధులు నిర్వహిస్తున్న భారత పోలీసు బృందంపై చైనా సైనికులు జరిపిన దాడిలో పది మంది పోలీసులు వీరమరణం పొందారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారి స్మారకార్థం ప్రతి ఏటా అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సైకిల్ ర్యాలీ ద్వారా పోలీసుల సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్ర, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని బయ్యారం సీఐ రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో బయ్యారం ఎస్సై ప్రశాంత్ బాబు, గార్ల ఎస్సై సాయి కుమార్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి సేవలు భావితరాలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## డోర్నకల్ అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక దృష్టి!

- **రోడ్ల విస్తరణ, మోడల్ మార్కెట్ పనులు వేగవంతం చేయాలి**
- **ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాల అభివృద్ధి**
- **జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**డోర్నకల్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** పట్టణాల రూపురేఖలు మార్చేలా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ఈ ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులకు సూచించారు. డోర్నకల్ మండల కేంద్రంలోని ముత్యాలమ్మ టెంపుల్ జంక్షన్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులు, రోడ్డు విస్తరణ, మోడల్ మార్కెట్ నిర్మాణ పనులను శుక్రవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముత్యాలమ్మ ఆలయం నుంచి గార్ల వరకు 7.50 మీటర్ల మేర చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ఆలయ, మసీదు ప్రతినిధులు పరస్పర సహకారంతో ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. పట్టణంలో రహదారుల విస్తరణ, అంతర్గత డ్రైనేజీ, మోడల్ మార్కెట్ అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనల ప్రకారం మోడల్ మార్కెట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పట్టణాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, అవసరమైన చోట రహదారుల విస్తరణతో పాటు అంతర్గత డ్రైనేజీ, వీధి దీపాలు, ఆరోగ్య, పారిశుధ్య సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో అవసరాలను గుర్తించి నిధుల కేటాయింపునకు అనుగుణంగా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ బి. నాగరాజు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటు నమోదుపై సత్యవతి రాథోడ్ ప్రత్యేక దృష్టి!

- **ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యం**
- **కాంగ్రెస్ హామీల వైఫల్యాలకు పట్టభద్రులు ఓటుతో బుద్ధి చెప్పాలి**
- **కేసముద్రం సమీక్ష సమావేశంలో పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి దిశానిర్దేశం**

కేసముద్రం విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, మహబూబాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ సత్యవతి రాథోడ్ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించారు. కేసముద్రం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆమె పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, సమయం తక్కువగా ఉన్నందున ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులకు ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి వారిని కూడా నమోదు చేయించాలని సూచించారు. మండలంలోని పార్టీ నాయకులు, బాధ్యులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని, రైతులకు ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకుండా వంచించిందని సత్యవతి రాథోడ్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను పట్టభద్రులు గుర్తించాలని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కురవి ఆలయ అభివృద్ధికి అధికారుల మౌనం

- **ప్రభుత్వ భూములున్నా భూసేకరణకు ముందడుగు ఏది?**
- **ఆక్రమణలపై మౌనం.. సర్వేపై నిర్లక్ష్యం**
- **భక్తుల సహనానికి పరీక్ష!**
- **ఎమ్మెల్యే చొరవకు అధికార యంత్రాంగం సహకరించదా?**



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కురవి శ్రీ వీరభద్రస్వామి సమేత భద్రకాళి ఆలయ అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయా? ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయనే ప్రచారం ఉన్నప్పటికీ, వాటిని గుర్తించి ఆలయ అవసరాలకు కేటాయించడంలో అధికార యంత్రాంగం ఎందుకు జాప్యం చేస్తోంది? ఆలయ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు చొరవ చూపుతుంటే క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం ఎందుకు వేగం పెంచడం లేదు? ఇప్పుడు కురవిలో భక్తులు, స్థానికుల మధ్య ఇవే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. మహబూబాబాద్ జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందిన కురవి వీరభద్రస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటే ముందుగా భూముల సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ఆలయ విస్తరణ, పార్కింగ్, ఇతర మౌలిక వసతుల కల్పనకు భూసేకరణ కీలకం. ఈ దిశగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బానోత్ రామచంద్రునాయక్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నప్పటికీ, రెవెన్యూ శాఖ నుంచి ఆశించిన స్థాయిలో కార్యాచరణ కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ భూములు ఏమవుతున్నాయి?**

ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. వాటిని పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు నిర్ణయించాల్సిన అధికారులు ఆ దిశగా వేగవంతమైన చర్యలు చేపట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాల భూమిని గుర్తించారు? ఎంత భూమి అన్యాక్రాంతమైంది? ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**ప్రజాప్రతినిధి చొరవ.. అధికారుల స్పందన ఏది?**

ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు వాటిని కార్యరూపంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై లేదా? కేవలం హామీలు, ప్రకటనలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందా? భూసేకరణ ప్రక్రియలో జాప్యం కొనసాగితే ఆలయ అభివృద్ధి ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల విశ్వాసంతో ముడిపడిన ఆలయ అభివృద్ధి విషయంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

**రికార్డులు బయటపెట్టి.. సర్వే పూర్తి చేయాలి!**

ఆలయ పరిసరాల్లోని ప్రభుత్వ భూముల వివరాలను బహిర్గతం చేయాలని, రెవెన్యూ రికార్డుల ఆధారంగా సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలు ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భూముల గుర్తింపు, స్వాధీనం, కేటాయింపు ప్రక్రియకు కాలపరిమితి విధించి పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఆలయ అభివృద్ధికి అడ్డంకిగా మారిన భూసేకరణ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

**సర్వే చేస్తాం.. భూమి ఉంటే కేటాయిస్తాం: తహసీల్దార్**

ఈ విషయంపై 'విశాల భారతి' ప్రతినిధి వివరణ కోరగా, గతంలో కొంత భూమిని ఆలయానికి కేటాయించడం జరిగిందని కురవి తహసీల్దార్ విజయ తెలిపారు. పూర్తిస్థాయిలో రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహిస్తామని, ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం ఆలయానికి కేటాయించే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మరి ఆ సర్వే ఎప్పుడు? భూముల గుర్తింపు ఎప్పటికి? ఆలయ అభివృద్ధికి కార్యరూపం ఎప్పుడు? తహసీల్దార్ ఇచ్చిన హామీ క్షేత్రస్థాయిలో అమలై భక్తుల ఆశలు నెరవేరుతాయా? లేక అధికారుల ఫైళ్లలోనే ఆలయ అభివృద్ధి ప్రణాళికలు మగ్గిపోతాయా? అన్నది వేచి చూడాల్సిందే.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- **మహబూబాబాద్‌ను నషా ముక్త్ జిల్లాగా తీర్చిదిద్దాలి.**
- **పోస్టర్లు విడుదల చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రవి రాథోడ్.**

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రగతి గ్రామీణ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో రూపొందించిన 'నషా ముక్త్ యువ వికసిత్ భారత్' అవగాహన కార్యక్రమ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, సామాజిక దుష్పరిణామాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువత వ్యసనాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మహబూబాబాద్ జిల్లాను నషా ముక్త్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో రాజకుమార్, సీహెచ్ఓ జ్ఞాన సుందరి, భాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భూక్యా పుణ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శ

- **కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి పరామర్శించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే**

**మరిపెడ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** మరిపెడ మండలం బావోజి గూడెం గ్రామానికి చెందిన భూక్యా పుణ్య కుటుంబ సభ్యులను డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శించారు. భూక్యా కోక్యా, సక్రుతో కలిసి గ్రామానికి చేరుకున్న ఆయన కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ధైర్యం చెబుతూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్యా శంకర్, మాజీ సర్పంచ్ కోట కరుణాకర్ రెడ్డి, అజ్మీరా రెడ్డి, లాలు, దిగజేర్ల శ్రీను, పట్టాభి, శ్రీనివాస్, దేవేందర్, భూక్యా లచ్చు, వెంకన్న, మంగు, ఉపేందర్, రాజేష్, అప్రు, చందా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుపై గార్లపాటి భరద్వాజ్ రెడ్డి ప్రత్యేక ఫోకస్

- **ఏడు గ్రామాల్లో విస్తృత పర్యటన**
- **నవంబర్ 6 తుది గడువులోగా నమోదు పూర్తి చేయాలని పిలుపు**

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు కురవి మండలంలో విస్తృత పర్యటన చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల మండల కన్వీనర్ గార్లపాటి భరద్వాజ్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతూ ఓటరు నమోదు ప్రక్రియపై స్థానిక నాయకులు, పట్టభద్రులకు అవగాహన కల్పించారు. మండలంలోని నెరడ, బాల్య తండా, కాకుల బోడు తండా, చీంలా తండా, ఎలక చెట్టు తండా, తట్టుపల్లి, చంద్య తండా గ్రామాల్లో పర్యటించి అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. నవంబర్ 6వ తేదీ తుది గడువు కావడంతో గడువు ముగిసేలోగా ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి దరఖాస్తులు చేయించాలని భరద్వాజ్ రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఓటరు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని, ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ గౌడ్, కురవి టౌన్ ప్రెసిడెంట్ ఎన్. రాజేందర్ కుమార్, డాక్టర్స్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వీరన్న, కురవి దేవస్థానం చైర్మన్ కోర్నీ రవీందర్ రెడ్డి, కోర్నీ చందు, ఆయా గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

- **వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం**

**రాజేంద్రనగర్,విశాల భారతి :** పోలీస్ అమరవీరుల వారోత్సవం, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా అత్తాపూర్ పరిధిలోని శ్రీ మేధా జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ అంశాలపై విద్యార్థులు రాసిన వ్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ. సీతయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, రహస్య సంకేతాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఇన్‌స్పెక్టర్ ఎ. సీతయ్య బహుమతులు అందజేసి అభినందించారు. మొదటి బహుమతిని సీనియర్ ఎం.ఈ.సీ విద్యార్థిని గ్రీష్మ లక్ష్మి, రెండో బహుమతిని సీనియర్ బైపీసీ విద్యార్థిని గడ్డం లహరి, మూడో బహుమతిని జూనియర్ సీఈసీ విద్యార్థిని అడాల ప్రణవి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన పోలీసు అధికారులు, విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, దేశభక్తి, చట్టాల పట్ల గౌరవం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను విద్యార్థులకు తెలియజేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ ఎస్ఐ శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ వి.ఎన్. అయ్యన్న బాబు, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విజయవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని పోలీసు అధికారులు అభినందించారు.

## మంచిర్యాల, దండేపల్లి ఘటనలపై ప్రత్యేక దర్యాప్తు బృందం

- **సాంకేతిక ఆధారాలతో నిష్పక్షపాత విచారణ: సీపీ అంబర్ కిషోర్ ఝా**




**విశాల భారతి రామగుండం :** మంచిర్యాల, దండేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై సమగ్ర దర్యాప్తు చేపట్టేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. తన ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ నేతృత్వంలో ఏర్పాటైన ఈ బృందం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేక బృందం సంఘటన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులు, సాక్షులను విచారించనుంది. సాంకేతిక ఆధారాలను సేకరించి విశ్లేషించడంతో పాటు అందుబాటులో ఉన్న సాక్ష్యాల ఆధారంగా ఘటనల వాస్తవాలను, సంబంధిత వ్యక్తుల పాత్రను నిర్ధారించనుంది. మంచిర్యాల, దండేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు సీపీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న ఊహాజనిత వార్తలు, నిర్ధారణ కాని సమాచారం, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. వాటి ఆధారంగా ఆందోళనకు గురికావద్దని, పోలీస్ శాఖ అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని విశ్వసించాలని కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు రామగుండం పోలీస్ కమిషనరేట్ కట్టుబడి ఉందని సీపీ స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం వద్దు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**విశాల భారతి కామారెడ్డి ;** కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్లో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, జిల్లాలో అభివృద్ధి పనుల పురోగతి, ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

## ఆస్కార్ షార్ట్ ఫిల్మ్ కు మద్దతు

ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 80కిపైగా అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైన భారతీయ షార్ట్‌ఫిల్మ్ 'వీ వెర్ హియర్' ఆస్కార్ అవార్డుల బరిలో అర్హత సాధించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి తన మద్దతు ప్రకటిస్తూ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతల్ని స్వీకరించింది అగ్ర కథానాయిక ప్రియాంక చోప్రా. ముగ్గురు రిటైర్డ్ ఉద్యోగులు చుట్టూ తిరిగే కథ ఇది. యంత్రాలు మనుషుల ఉద్యోగాల్ని ఆక్రమిస్తున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ వారు వినూత్న కార్యక్రమాల్ని మొదలుపెడతారు.ఈ నేపథ్యంలో హాస్యం, సందేశం ప్రధానంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. సాంకేతిక పరిజ్ఞానం పైచేయి సాధించి మనుషుల ప్రాధాన్యం తగ్గిపోతుందనే బలమైన అంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం కావడం పట్ల ప్రియాంకచోప్రా ఆనందం వ్యక్తం చేసింది. ఆమె మాట్లాడుతూ 'అద్భుతమైన ఆలోచనతో సినిమా తీసిన చిత్రబృందాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా బాధ్యతలు తీసుకున్నా. తప్పకుండా ఆస్కార్‌లో విజేతగా నిలుస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పింది. ఈ షార్ట్ ఫిల్మ్‌కు ప్రణవ్ భాసిన్ దర్శకత్వం వహించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.